

పౌరసరఫరాల శాఖకు దరఖాస్తుల వెల్లువ

- కొత్త పేర్లు చేర్చడానికి అత్యధికంగా అప్లికేషన్లు
- మార్పులు, చేర్పులు, తొలగింపులతోపాటు కొత్త కార్డుల కోసం మొత్తం 8.113 దరఖాస్తులు పెండింగ్

రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులు, కొత్త రేషన్ కార్డుల కోసం ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు వస్తున్నాయి. -8లో

విశాఖకు సెమీ రింగ్ రోడ్డు

- రాంబిల్లి నుంచి తాళ్లపాలెం, కొత్తవలస, విజయనగరం మీదుగా భోగాపురం వరకూ నిర్మాణానికి ప్రతిపాదన
- నివేదిక తయారీకి కన్సల్టెంట్ నియామకం కోసం వీఎంఆర్‌డీఏ ప్రకటన



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర రాజధాని అమరావతికి రింగ్ రోడ్లు నిర్మిస్తున్నట్టే ఆర్థిక రాజధాని విశాఖపట్నానికి కనీసం ఓ రింగ్ రోడ్డు ఉండాలని ప్రభుత్వం భావిస్తోంది. విశాఖ నగరానికి ఓ వైపు సముద్రం, మూడు వైపులా కొండలు ఉండడం వల్ల అమరావతిలా పూర్తి రింగ్ రోడ్డు నిర్మించే అవకాశం లేదు. అందుకని సెమీ రింగ్ రోడ్డు అయినా ప్లాన్ చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతంలోనే జిల్లా అధికారులకు ఆదేశించారు. దీనిపై విశాఖ మహా నగర ప్రాంత అభివృద్ధి సంస్థ (వీఎంఆర్‌డీఏ) ప్రణాళికలు సిద్ధం చేస్తోంది.

ప్రస్తుతం నగరం మధ్య నుంచి జాతీయ రహదారి వెళుతోంది. విశాఖ నుంచి భీమిలి మీదుగా భోగాపురం వరకు కోస్టల్ కారిడార్ ప్రతిపాదన కేంద్ర ప్రభుత్వం వద్ద ఉంది. అంటే సగం రింగ్ రోడ్డుకు ప్లానింగ్ పూర్తయినట్టుగానే జిల్లా అధికారులు చెబుతున్నారు. మిగిలిన సగం రింగ్ రోడ్డును అనకాపల్లి జిల్లా రాంబిల్లి వద్ద ప్రారంభించి తాళ్లపాలెం, అనకాపల్లి (రాష్ట్ర జాతీయ రహదారిని తాకకుండా), కొత్తవలస మీదుగా విజయనగరం నుంచి భోగాపురం కలుపుతూ ఏర్పాటుచేయాలని వీఎంఆర్‌డీఏ అధికారులు ఒక అంచనాకు వచ్చారు. ఇది అర్ధ చంద్రాకారంలో ... మిగతా 8వ పేజీలో

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ షురూ

ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో 3,158 స్కూళ్లు

- 33 యూపీ పాఠశాలలు హైస్కూళ్లుగా అప్‌గ్రేడ్
- మోడల్ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎంలుగా స్కూలు అసిస్టెంట్
- మొత్తం 538 పోస్టులు సర్దుబాటు



ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ కానున్న మాకవరపాలెం జి.వెంకటాపురం ప్రాథమికోన్నత పాఠశాల

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి):

వైసీపీ హయాంలో వెలువడిన జీవో 117ను రద్దు చేస్తూ... పాఠశాలల పునర్వ్యవస్థీకరణ ప్రక్రియకు ప్రభుత్వం ఆమోదం తెలిపింది. దీని ప్రకారం ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో అన్ని రకాల పాఠశాలలు కలిపి 3,158 ఉంటాయి. ఇందులో 228 ఫౌండేషన్ పాఠశాలలు, 1,921 బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 563 మోడల్ ప్రాథమిక పాఠశాలలు, 89 యూపీ పాఠశాలలు, 237 ఉన్నత పాఠశాలలు, 88 ఉన్నత పాఠశాలలు ప్లస్ బేసిక్ ప్రాథమిక పాఠశాలలు, 32 ఉన్నత పాఠశాలలు ప్లస్ మోడల్ ప్రాథమిక పాఠశాలలు ఉంటాయి. పిల్లల సంఖ్య ఎక్కువ కలిగిన, ఉన్నత పాఠశాలలు ఐదు కిలోమీటర్లకు మించి దూరంలో ఉన్న ప్రాంతాల్లో గల 33 యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణలో భాగంగా విద్యార్థులు, ఉపాధ్యాయుల నిష్పత్తిని పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, కొత్తగా ఏర్పాటుచేసే మోడల్ ప్రాథమిక పాఠశాలలకు ప్రధానోపాధ్యాయులుగా స్కూల్ అసిస్టెంట్లను నియమించనున్నది. అయితే ఇప్పటికే ఎక్కువమంది విద్యార్థులు గల ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయులు (స్కూల్ అసిస్టెంట్ కేడర్) ఉన్నచోట వారినే కొనసాగించనున్నది. ప్రస్తుతం ఉమ్మడి జిల్లాలో 563 మోడల్ ప్రాథమిక పాఠశాలల్లో 286 పాఠశాలలకు ఎల్ఎఫ్ఎల్ హెచ్‌ఎంలు పనిచేస్తున్నారు. మిగిలిన 277 మోడల్ ప్రాథమిక పాఠశాలలకు స్కూల్ అసిస్టెంట్లను హెచ్‌ఎంలుగా నియమిస్తారు. ఇందులో 252 మంది మండల/జడ్పీ పాఠశాలలు, 16 మంది ప్రభుత్వ పాఠశాలలు, తొమ్మిది మంది జీవీఎంసీలో పనిచేస్తున్న స్కూలు అసిస్టెంట్లు ఉన్నారు.

తాజాగా తీసుకున్న నిర్ణయం మేరకు ఉమ్మడి జిల్లాలో 538 హెచ్‌ఎంలు/స్కూలు అసిస్టెంట్లు/ఎస్జీటీ పోస్టులను ఒక పాఠశాల నుంచి మరోచోటకు సర్దుబాటు చేశారు. అందులో 277 మంది స్కూలు అసిస్టెంట్లను మోడల్ ప్రాథమిక పాఠశాలల హెచ్‌ఎంలుగా నియమిస్తారు. మరో 28 స్కూలు అసిస్టెంట్లు, మూడు ఎస్జీటీ పోస్టులను అవసరం ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేశారు. ఇంకా 23 హెచ్‌ఎం, 103 స్కూల్ అసిస్టెంట్, 104 ఎస్జీటీ పోస్టులు... మొత్తం 230 పోస్టులను ఒక పాఠశాల నుంచి మరో పాఠశాలకు సర్దుబాటు చేశారు. ఈ నేపథ్యంలో పిల్లలు తక్కువ గల ఉన్నత పాఠశాలల్లో హెచ్‌ఎం పోస్టులు రద్దు చేసి కొత్తగా అప్‌గ్రేడ్ చేసిన ఉన్నత పాఠశాలలకు కేటాయించారు. కొన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యకు మించి ఒక సబ్జెక్టులో ఎక్కువ మంది స్కూలు అసిస్టెంట్ ... మిగతా 8వ పేజీలో

కొత్తగా అమలులోకి వచ్చిన విధానం ప్రకారం...అనకాపల్లి జిల్లాలో 1,396, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 1,200, విశాఖపట్నం జిల్లాలో 562 పాఠశాలలు ఉంటాయి.

జిల్లా	ఫౌండేషన్	బేసిక్ ప్రాథమిక	మోడల్ ప్రాథమిక	యూపీ	ఉన్నత	ఉన్నత ప్లస్ బేసిక్	ఉన్నత ప్లస్ మోడల్
అల్లూరి జిల్లా	36	925	199	13	16	4	9
అనకాపల్లి	151	764	187	55	145	78	18
విశాఖపట్నం	41	232	178	21	76	10	5
మొత్తం	228	1,921	563	89	237	88	32

ఆర్ఓఆర్ కక్షిదారులకు ఊరట

భూముల కేసులు ఇక నర్సీపట్నం ఆర్డీవో కోర్టులోనే పరిష్కారం

- ఆర్ఓఆర్ కేసులను డీఆర్వో కోర్టుకు బదిలీ చేసిన గత ప్రభుత్వం
- అందరూ అనకాపల్లి వెళ్లాల్సిన పరిస్థితి
- ప్రజల నుంచి కూటమి ప్రభుత్వానికి వినతులు
- మళ్లీ పాత పద్ధతిలోనే నర్సీపట్నం ఆర్డీఓ కోర్టుకు..
- ఈ నెల 24 నుంచి అమలు
- డివిజన్‌లోని 12 మండలాల కక్షిదారులకు తప్పిన వ్యయప్రయాసలు



ఆర్డీవో కోర్టు నిర్వహించే నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయం

నర్సీపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి):

భూ హక్కుల చట్టం ప్రకారం దాఖలైన కేసుల్లో అనకాపల్లి డీఆర్వో కోర్టు చుట్టూ తిరుగుతున్న కక్షిదారులకు ఊరట లభించింది. ఇకనుంచి అనకాపల్లి వెళ్లాల్సిన అవసరం లేకుండా పాత పద్ధతిలో నర్సీపట్నం ఆర్డీవో కోర్టులోనే పరిష్కారం కానున్నాయి. పట్టాదారు పుస్తకాల వివాదాలన్నీ ఆర్ఓఆర్ చట్టం పరిధిలోకి వస్తాయి. రెండేళ్ల క్రితం వరకు డివిజన్‌లోని ఆర్ఓఆర్ కేసులు ఆర్డీవో కోర్టులో పరిష్కారం అయ్యేవి. అయితే గత వైసీపీ ప్రభుత్వం 2023లో ఆర్డీవో కోర్టుని పూర్తిగా రద్దు చేసింది. పట్టాదారు పాసు పుస్తకాలకు సంబంధించిన కేసులను అనకాపల్లి జిల్లా రెవెన్యూ అధికారి కోర్టుకి బదలాయించారు. దీంతో కక్షిదారులు వ్యయ ప్రయాసలతో ప్రతి శనివారం వాయిదాల కోసం అనకాపల్లి డీఆర్వో కార్యాలయానికి వెళ్లాల్సి వచ్చేది. కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి వచ్చింది. పాత పద్ధతిలో ఆర్డీవో కోర్టులోనే ఆర్ఓఆర్ కేసులు పరిష్కారం అయ్యేలా నిర్ణయం తీసుకుంది. డివిజన్ పరిధిలోని నర్సీపట్నం, మాకవరపాలెం, గొలుగొండ, నాతవరం, పాయకరావుపేట, కోటవురట్ల, నక్కపల్లి, ఎస్.రాయవరం, రోలుగుంట, రావికమతం, మాడుగుల, చీడికాడ మండలాలకు చెందిన కక్షిదారులు ఇకనుంచి అనకాపల్లి వెళ్లాల్సిన అవసరం లేదు.

ఈ నెల 24 నుంచి ఆదేశాలు అమలు

నర్సీపట్నం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఈ నెల 24వ తేదీ నుంచి పూర్తి స్థాయిలో ఆర్డీవో కోర్టు నడపడానికి చర్యలు తీసుకున్నారు. డివిజన్‌లో 360కి పైగా ఆర్‌వోఆర్ కేసులు ఉన్నాయి. వీరందరికి నోటీసులు ఇచ్చి వాయిదాలకు నర్సీపట్నం ఆర్డీవో కోర్టుకి రమ్మంటారు. నర్సీపట్నంలో ఆర్డీవో కోర్టు నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని రెవెన్యూ డివిజనల్ అధికారి వీవీ రమణ తెలిపారు.

బెండ రైతు దిగాలు

దేవరాపల్లి మార్కెట్‌లో ఒక్కసారిగా పడిపోయిన ధర

- 12 కిలోల క్రేట్ బెండకాయలు రూ.20కి కూడా అమ్ముడుపోని దుస్థితి
- రోడ్డుపై పారబోసి వెళ్లిపోయిన రైతులు



బెండ కాయల క్రేట్‌లతో కొనుగోలుదారుల కోసం నిరీక్షిస్తున్న రైతులు



దేవరాపల్లి మార్కెట్ వద్ద రోడ్డుపై పారబోసిన బెండకాయలు

దేవరాపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి):

బెండకాయ ధర ఒక్కసారిగా పడిపోయింది. మంగళవారం స్థానిక మార్కెట్‌లో సుమారు 12 కిలోలు వుండే క్రేట్ బెండకాయలను రూ.20కి కూడా కొనుగోలుచేసేవారు కరువయ్యారు. దీంతో కొంతమంది రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తూ బెండకాయలను రోడ్డుపై పారబోసి ఖాళీ క్రేట్‌లతో ఇళ్లకువెళ్లిపోయారు. స్థానిక వనదేవీశ్వర ఆలయం వద్ద సోమవారం మినహా మిగిలిన అన్ని రోజులూ చుట్టుపక్కల గ్రామాల రైతులు కూరగాయలను తీసుకువచ్చి అమ్ముకుంటుంటారు. ప్రస్తుతం బెండ, ఆనప, బీర, బరబాటీలు అధికంగా వస్తున్నాయి. వేసవిలో బెండ కాపు ఆశాజనకంగా వుంటుంది. దీంతో దేవరాపల్లి మండలంతో పాటు ... మిగతా 8వ పేజీలో

మూడు రోడ్ల అభివృద్ధికి రూ.3.43 కోట్లు మంజూరు

- ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు



ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు

చోడవరం, మే 13 (ఆంధ్రజ్యోతి):

చోడవరం నియోజకవర్గంలో మూడు ప్రధానమైన రహదారుల అభివృద్ధికి రూ.3.43 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్ రాజు మంగళవారం తెలిపారు. బుచ్చెయ్యపేట మండలం రాజాం నుంచి తట్టబంద వరకు 4.3 కిలోమీటర్ల రోడ్డు అభివృద్ధికి రూ.1.4 కోట్లు, ఇదే మండలం గున్నెంపూడి పెదమదీనా నుంచి చింతపాక మీదుగా సీతయ్యపేట వరకు 3.3 కిలోమీటర్ల రోడ్డుకు రూ.1.33 కోట్లు, రావికమతం మండలం కొత్తకోట నుంచి రొచ్చుపణుకు రోడ్డు అభివృద్ధికి రూ.70 లక్షలు మంజూరయ్యాయని, త్వరలోనే పనులు ప్రారంభం అవుతాయని ఆయన చెప్పారు.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలి

- అధికారులకు జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర ఆదేశం
- స్థాయీ సంఘాల సమావేశంలో పలు అంశాలపై చర్చ



సమావేశంలో పాల్గొన్న జడ్పీటీసీ సభ్యులు, అధికారులు



సమావేశంలో మాట్లాడుతున్న జడ్పీ చైర్‌పర్సన్ సుభద్ర, పక్కన సీఈవో పి.నారాయణమూర్తి

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి):

ప్రజా సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పనిచేయాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర ఉమ్మడి విశాఖ జిల్లా అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె అధ్యక్షతన జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఉమ్మడి జిల్లా ఒకటి నుంచి ఏడు వరకు స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించారు. ఇందులో గ్రామీణాభివృద్ధి, ప్రజా సంక్షేమం, పనులు, ప్రణాళికలు, ఆర్థిక సాయం, వైద్యం-ఆరోగ్యం తదితర అంశాలపై చర్చించారు. ముందుగా వివిధ శాఖల అధికారులు ప్రగతి నివేదికలు సమర్పించారు. అనంతరం సభ్యులు కోరిన వివరణలపై సమాధానాలిస్తూ.. ఇప్పటి వరకు తీసుకున్న చర్యలు, చేపట్టబోయే పనులను వివరించారు. చైర్‌పర్సన్ సుభద్ర మాట్లాడుతూ ప్రతీ నెల 1న 98 శాతం మందికి సామాజిక పింఛన్లు అందజేస్తున్నామని, ఈ విషయంలో సమస్యలు వస్తే ఎంపీడీవోలకు తెలియజేయాలని సూచించారు. అరకులోయ జడ్పీటీసీ సభ్యురాలు ... మిగతా 8వ పేజీలో

పాడేరు మోదకొండమ్మకు భక్త నీరాజనం



అమ్మవారి పాదాలు, ఉత్సవ విగ్రహం, గరగను మోసుకొస్తున్న ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, ఇన్‌చార్జి కలెక్టర్ అభిషేక్‌గౌడ, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి




ఘటాలు సమర్పించేందుకు ఆలయానికి వస్తున్న భక్తులు

పాడేరు మోదకొండమ్మ మూడు రోజుల ఉత్సవాలు మంగళవారం నిర్వహించిన అనుపోత్సవంతో ముగిశాయి. తొలి రోజు ఆదివారంనాడు ఉత్సవం విగ్రహం, పాదాలను ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి సతకంపట్టు వద్ద కొలువు తీర్చడంతో మొదలైన ఉత్సవాలు.. ఆఖరి రోజైన మంగళవారం సతకంపట్టు నుంచి ఉత్సవ విగ్రహాన్ని, పాదాలను తిరిగి ఆలయానికి చేర్చడంతో ముగిశాయి. - వార్త 8వ పేజీలో

సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రద్దీ

మ్యారేజీ సర్టిఫికెట్ల కోసం పోటెత్తిన నూతన దంపతులు

- ఒక్కో దరఖాస్తుకు ముగ్గురి సాక్షి సంతకాలు
- కిటకిటలాడిన అనకాపల్లి కార్యాలయం
- ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



కిటకిటలాడుతున్న అనకాపల్లి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం

కొత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి):

అనకాపల్లి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం మంగళవారం వివిధ పనులపై వచ్చిన వారితో కిటకిటలాడింది. ఆస్తుల రిజిస్ట్రేషన్‌తోపాటు వివాహ రిజిస్ట్రేషన్ కోసం పెద్ద సంఖ్యలు జనం వచ్చారు. కార్యాలయం హాలు చిన్నదిగా వుండడంతోపాటు తీవ్ర ఎండవేడి, ఉక్కపోతతో ఇబ్బందులు పడ్డారు. చెమటతో తడిసి ముద్దయ్యారు. కార్యాలయంలోకి అడుగుపెట్టలేనంతగా జనంతో నిండిపోయింది. ప్రభుత్వం కొత్త దంపతులతోపాటు, రేషన్‌కార్డు లేని వారు కూడా దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించిన విషయం తెలిసిందే. కొత్త దంపతులు దరఖాస్తుతోపాటు మ్యారేజీ సర్టిఫికెట్‌ను జత చేయాలి. దీంతో ఇటీవల కాలంలో వివాహాలు చేసుకున్న వారంతా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వస్తున్నారు. దంపతులతోపాటు ప్రతి దరఖాస్తుకు ముగ్గురు సాక్షి సంతకాలు చేయాల్సి వుండడంతో ఒక్కో దరఖాస్తుకు ఐదుగురు చొప్పున వచ్చారు. దీంతో ఇరుకుగా వున్న హాలులో ఎక్కువసేపు వేచివుండాల్సి రావడంతో ఉక్కపోతకు గురయ్యారు. కొంతమందికి ఊపిరి ఆడక కాసేపటికోసారి బయటకు వెళ్లివచ్చారు. సిబ్బంది రాత్రి వరకు కార్యాలయంలోనే వుండి మ్యారేజీ సర్టిఫికేట్ కోసం స్లాట్ తీసుకున్న వారికి రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేశారు. ఒక్క రోజే 92 మంది మ్యారేజ్ సర్టిఫికెట్లకు రిజిస్ట్రేషన్ చేసుకున్నట్టు సిబ్బంది తెలిపారు. ఇదిలావుండగా స్థానిక కార్యాలయంలో సబ్ రిజిస్ట్రార్-1 మాధవీకుమారి మూడు నెలలుగా సెలవులో ఉన్నారు. సబ్ రిజిస్ట్రార్-2 నిరంజన్ కుమార్ ఒక్కరే అన్ని రిజిస్ట్రేషన్లు చేయాల్సి వస్తున్నది.

వర్షపు నీటిని ఒడిసి పడదాం

⏩ ఉపాధి పనులతో పంట కుంటలు.. ⏩ మండలంలో పూర్తయిన 53 ఫారం పాండ్స్



అమలాపురంలో ఉపాధి హామీ పథకంలో తవ్విన పంట కుంట

నక్కపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): భవిష్యత్తులో పలు రకాల ప్రయోజనాలు చేకూరాలన్న ఉద్దేశంతో ఉపాధి హామీ పథకం పనులు చేపడుతున్నారు. భూగర్భ జలాలు పడిపోకుండా కాపాడడమే గాకుండా.. పంటల సాగుకు నీటి వనరుల కొరత లేకుండా చర్యలు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో ఈ వేసవి సీజన్‌లో ఉపాధి పథకం పనుల ద్వారా అన్ని గ్రామాల్లో పంట కుంటలు (ఫారం పాండ్స్) నిర్మిస్తున్నారు. మండలంలో 31 పంచాయతీల్లో పంట కుంటల పనులు చురుగ్గా సాగుతున్నాయి. సగటున రోజుకు 7 వేల నుంచి 7,600 మంది ఉపాధి కూలీలు పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. మండలంలో మే నెలాఖరు నాటికి 100 ఫారం పాండ్స్ నిర్మించాలని టార్గెట్ పెట్టారు. ఇప్పటికే పలు గ్రామాల్లో 53 నిర్మాణ పనులు పూర్తయ్యాయి. వర్షపు నీరు వృథా కాకుండా నేరుగా ఈ పంట కుంటల్లో చేరే విధంగా చర్యలు చేపడుతున్నారు. వర్షపు నీటిని ఆదా చేయడం ద్వారా వ్యవసాయానికి కావల్సిన నీటిని రైతులు పొందే వెసులబాటు కలుగుతుంది.

రైతులకు ఎంతో మేలు

డి.సీతారామరాజు, ఎంపీడీవో



ఉపాధి పనుల్లో పంట కుంటలను నిర్మిస్తున్నాం. భవిష్యత్తులో రైతులకు వీటి వలన ఎంతో ఉపయోగం ఉంది. నెలాఖరు నాటికి 100 ఫారం పాండ్స్ నిర్మాణాలు పూర్తి చేస్తాం. ఇందులో నీరు నిల్వ ఉండడం వల్ల భూగర్భ జలాలు పెరుగుతాయి. అలాగే రైతులకు సాగు నీటి అవసరాలు తీరుతాయి.

వెంకటపతిరాజు చెరువులో మట్టి అక్రమ తవ్వకాలు

పట్టించుకోని ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు



వెంకటపతిరాజు చెరువులో మట్టిని తవ్వి తరలించుకుపోయిన దృశ్యం

పాయకరావుపేట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శ్రీరాంపురం పరిధిలో ఉన్న వెంకటపతిరాజు చెరువులోని మట్టిని కొంతమంది అక్రమంగా తరలించుకుపోతున్నారు. ఈ చెరువు కింద సుమారు రెండు వేల ఎకరాల ఆయకట్టు ఉంది. సుమారు 500 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ చెరువు ఆక్రమణల పాలై ప్రస్తుతం 100 ఎకరాలకు చేరుకుంది. దీనికితోడు చెరువు నుంచి పంట పొలాలకు నీటిని తరలించేందుకు ఏర్పాటుచేసిన తూరలు ఎత్తులో ఉండడంతో రైతులకు సాగునీరు అందే పరిస్థితి లేదు. ఏటా ఉపాధి హామీ పథకంలో చెరువు గర్భంలో పూడికతీత పనులు చేపడుతున్న అధికారులు చెరువులో తీసిన చోటే మరలా గోతులు తీస్తుండడం వలన ఆయా ప్రాంతాల్లో పెద్ద పెద్ద గోతులు ఏర్పడుతున్నాయి. అదేవిధంగా కొంతమంది మట్టి మాఫియా రాత్రిపూట ఎక్స్‌కవేటర్‌తో తవ్వి చెరువులో మట్టిని తరలించుకుపోతున్నారు. ఈ కారణంగా వర్షాలు లేని సమయంలో చెరువులో ఉండే కొద్దిపాటి నీరు ఆయా గోతుల్లో నిలిచిపోతుండడంతో ఏటా నవంబరు, డిసెంబరు నెలల్లో ఆయకట్టు భూములకు సాగునీరందే పరిస్థితి లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి అక్రమార్కులు ఎక్స్‌కవేటర్‌తో చెరువులో పెద్ద గొయ్యి తవ్వి మట్టి తరలించుకుపోయారు. ఇప్పటికైనా చెరువులో మట్టి తవ్వకాలను అధికారులు అడ్డుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

అధ్వానంగా కొత్తపేట కాలనీ రోడ్డు

పదేళ్లుగా మరమ్మతులు చేపట్టని పాలకులు, అధికారులు



పాడైన కొత్తపేట ప్రధాన రోడ్డు

ఎలమంచిలి, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేట కాలనీ ప్రధాన రోడ్డు అధ్వానంగా ఉంది. రోడ్డు అభివృద్ధి గురించి అధికారులు గానీ, పాలకులుగానీ పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ కాలనీలో ప్రసిద్ధి చెందిన సీతారాముల ఆలయంతోపాటు, రామలింగేశ్వర ఆలయాలు ఉన్నాయి. ఈ ఆలయాలకు ప్రతి రోజూ వందలాది మంది భక్తులు వస్తుంటారు. అలాగే కాలనీ రోడ్డు గుండా మిలట్రీకాలనీ, కొత్తపేటల ప్రజలు ప్రయాణం చేస్తారు. వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. అయినా పదేళ్ల నుంచి రోడ్డు అభివృద్ధికి నోచుకోలేదు. ఈ రోడ్డు దుస్థితిని మునిసిపల్ పాలకవర్గ సమావేశాల్లో ఏ ఒక్క ప్రజాప్రతినిధి ప్రస్తావించకపోవడం విశేషం. కొత్తపేట కాలనీ ప్రధాన రోడ్డును అభివృద్ధి చేయాలని ఈ ప్రాంతవాసులు కోరుతున్నారు.

టీడీపీ మండల అధ్యక్ష, కార్యదర్శులుగా సన్యాసినాయుడు, శ్రీను



సన్యాసినాయుడు, శ్రీనులను అభినందిస్తున్న టీడీపీ జిల్లా నేత విజయబాబు(మధ్యలో)

ఎలమంచిలి, మే 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు దేశం పార్టీ ఎలమంచిలి మండల అధ్యక్ష, కార్యదర్శులుగా ఇత్తంశెట్టి సన్యాసినాయుడు, గెంజి శ్రీనులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మంగళవారం అచ్యుతాపురంలో జిల్లా అధ్యక్షుడు బత్తుల తాతయ్యబాబు, నియోజకవర్గ ఇన్‌చార్జి ప్రగడ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పప్పల చలపతిరావు సమక్షంలో జరిగిన ఎన్నికల్లో వీరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. టీడీపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన ఇత్తంశెట్టి సన్యాసినాయుడు పోతిరెడ్డిపాలెం గ్రామ సర్పంచ్‌గా సేవలు అందిస్తున్నారు. కార్యదర్శిగా ఎన్నికైన గెంజి శ్రీను గతంలో సర్పంచ్‌గా సేవలందించిన అనుభవం ఉంది. మాపై నమ్మకం ఉంచి మండల పార్టీ బాధ్యతలు అప్పగించిన నాయకులకు, అధిష్ఠానానికి వారు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై పలువురికి నోటీసులు

ఎలమంచిలి, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీఎన్‌టీ మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేసినట్టు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. మునిసిపల్ నిబంధనల మేరకు నోటీసులు జారీ చేశామన్నారు. ఇంటి రిజిస్టర్ దస్తావేజుల నకలు సమర్పించేందుకు నోటీసులు జారీ చేశామన్నారు. స్థలం హక్కు నిర్ధారించేందుకు భూ యాజమాన్య హక్కు పత్రాలను రెండు రోజుల్లో ఇవ్వాలని కోరామన్నారు. డాక్యుమెంట్లు పరిశీలించిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో పేర్కొన్నామని ఆయన చెప్పారు.

ఘనంగా పైడిమాంబ జాతర

ఎస్.రాయవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరుప్రోలు గ్రామంలో పైడిమాంబ అమ్మవారి జాతరను మంగళవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. మహిళలు అమ్మవారికి పిండి వంటలతో సారె సమర్పించారు. అమ్మవారిని స్థానికులతోపాటు పరిసర గ్రామాల ప్రజలు దర్శించుకొని పూజలు చేశారు. జాతర సందర్భంగా గ్రామంలో విద్యుత్ దీపాలను అలంకరించారు. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

బార్క్ నిర్వాసితుల జాబితాపై గ్రామసభ

⏩ అర్హుల పేర్లు గల్లంతయ్యాయని అభ్యంతరం



గ్రామసభలో మాట్లాడుతున్న ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస్

అచ్యుతాపురం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): అధికారులు ప్రకటించిన జాబితాల్లో అర్హులకు చోటులేకుండా చేయడంపై బార్క్ నిర్వాసితులు అధికారులను నిలదీశారు. మంగళవారం మండలంలోని రావిపాలెంలో బార్క్ నిర్వాసితుల జాబితాపై గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వాసితులు మాట్లాడుతూ గ్రామం చుట్టూ రక్షణ గోడ నిర్మిస్తున్నారని, గ్రామాన్ని తరలించే ఏర్పాట్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తమ న్యాయబద్ధమైన డిమాండ్లు పరిష్కరించకుండా అధికారులు పొమ్మనకుండా పొగపెడుతున్నారన్నారు. ఇంటి స్థలం కేటాయించి, ఇల్లు కట్టించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం అనకాపల్లి ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఆర్డీవో శ్రీనివాస్ మాట్లాడుతూ నిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వరహాలు, హెచ్‌డీటీ శ్యామ్, వీఆర్వో లక్ష్మి, జడ్పీటీసీ సభ్యుడు నర్మాలకుమార్, రాజాన అప్పారావు, కొల్లి సత్యారావు పాల్గొన్నారు.

సీబీఎస్ఈలో శ్రీప్రకాష్ విద్యార్థులు విజయకేతనం



సీబీఎస్ఈ టెన్త్‌లో అత్యుత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు



ప్లస్-2లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

పాయకరావుపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది సీబీఎస్ఈ పదవ తరగతి, ప్లస్-2 పరీక్షల్లో పాయకరావుపేట శ్రీప్రకాష్ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. మంగళవారం విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్ అందజేసిన వివరాలిలా ఉన్నాయి.

సీబీఎస్ఈ పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఎన్.సత్యసాయి 483/1000, ఎం.యశస్వి 482/1000, పి.తరుణ్‌కుమార్ 481/1000, ఎస్.రఘునందన్ 478/1000 మార్కులు సాధించారన్నారు. అదేవిధంగా ప్లస్-2 ఫలితాల్లో జి.సాయిఅనీష్ 469/500, ధాత్రి నిహారిక 466/500 మార్కులు సాధించి విజయకేతనం ఎగురవేశారన్నారు. తమ విద్యార్థులు నూటికి నూరు శాతం ఉత్తీర్ణత సాధించడంతోపాటు మాథ్స్, సైన్స్ సబ్జెక్టుల్లో 100కి 100 మార్కులు సాధించడం హర్షణీయమని తెలిపారు. కాగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు విద్యా సంస్థల అధినేత సీహెచ్‌వీకే. నరసింహారావు, సంయుక్త కార్యదర్శి సీహెచ్.విజయ్‌ప్రకాష్, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందనలు తెలిపారు.

జంపపాలెంలో అనధికార కొళాయిల తొలగింపు



జంపపాలెంలో అనధికార కొళాయిను తొలగిస్తున్న పంచాయతీ అధికారులు

ఎలమంచిలి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జంపపాలెం గ్రామంలో అనధికారికంగా ఏర్పాటు చేసుకున్న తాగునీటి కొళాయిలు, మోటార్లను మంగళవారం పంచాయతీ అధికారులు తొలగించారు. గ్రామంలో అనధికార కొళాయిలు ఏర్పాటుపైన, నీటి చౌర్యం గురించి ఉన్నతాధికారులకు ఫిర్యాదులు రావడంతో పంచాయతీ అధికారులు, గ్రామ సెక్రటరీ సోమునాయుడు చర్యలకు ఉపక్రమించారు. మంగళవారం ఉదయం గ్రామంలోని వీధుల్లో పరిశీలన జరిపి పదికి పైగా అనధికార కొళాయిలను గుర్తించి తొలగించారు. ఇకపై అనధికారికంగా కొళాయిలు ఏర్పాటు చేసినా, నీటిని చౌర్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవడం జరుగుతుందని వారు హెచ్చరించారు.

సాగునీటి ఇబ్బంది లేకుండా చేద్దాం : డీఈఈ



ఇరిగేషన్ డీఈ సురేష్‌కుమార్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఎస్.రాయవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్ సీజన్ నాటికి ఆయకట్టు రైతాంగానికి సాగునీటి ఇబ్బందులు లేకుండా చేద్దామని పాయకరావుపేట ఇరిగేషన్ డీఈఈ సురేష్‌కుమార్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మంగళవారం ఏఈ ఏపీ భాను అధ్యక్షతన నూతన సాగునీటి సంఘాల కమిటీలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని పలు గ్రోయిన్‌లు, పంట కాలువల మరమ్మతులకు ప్రతిపాదనలు పంపామని, నిధులు రాగానే అత్యవసర పనులు చేపట్టడం జరుగుతుందన్నారు. మాజీ ఎంపీపీ యేజెర్ల వినోద్‌రాజు మాట్లాడుతూ గత ఐదేళ్లలో పంట కాలువల్లో పూడికతీత, గ్రోయిన్‌ల మరమ్మతులు చేపట్టకపోవడంతో రైతులు సాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అనంతరం డీఈ సురేష్‌కుమార్‌ను మాజీ ఎంపీపీ వినోద్‌రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో సత్యనారాయణ, టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు, టీడీపీ నాయకులు గుర్రం రామకృష్ణ, కందుల వెంకటేశ్వరరావు, ముప్పిన శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా బంగారమ్మ జాతర



భక్తులతో కిటకిటలాడుతున్న బంగారమ్మ ఆలయ ప్రాంగణం

ఎస్.రాయవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవుపోలవరంలో బంగారమ్మ జాతరను మంగళవారం గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు స్థానికులతోపాటు పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. మహిళలు పసుపు, కుంకుమలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. టీడీపీ, జనసేన, వైసీపీ మండల నాయకులు, పలువురు ప్రజాప్రతినిధులు అమ్మవారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధనను టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు ప్రారంభించారు.



క్రికెట్ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న వెంకటరాజు, సీతారామరాజు

ముగిసిన క్రికెట్ పోటీలు

కొత్త రేవుపోలవరంలో బంగారమ్మ జాతర సందర్భంగా నిర్వహించిన క్రికెట్ టోర్నీలో మైలపల్లి ఎర్రయ్య జట్టు విన్నర్ కాగా పల్లేటి దాసుకు చెందిన జట్టు రన్నర్‌గాను నిలిచాయి. విన్నర్స్‌కు రూ.30 వేలు, రన్నర్‌కు రూ.20 వేలు నగదు బహుమతులను టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు ఎన్ వెంకటరాజు, ఆదర్శ విద్యా సంస్థల చైర్మన్ సీతారామరాజు అందజేశారు. ఈ టోర్నమెంట్‌ను గ్రామ మాజీ సర్పంచ్ చోడిపల్లి బంగారి సొంత నిధులతో నిర్వహించారు. క్రీడాకారులందరికీ క్రీడా దుస్తులు పంపిణీ చేసినట్టు బంగారి చెప్పారు.



గ్రామసభలో మాట్లాడుతున్న ఏపీఐఐసీ ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్‌డీ అనిత

లోవపాలెంలో ఆర్‌ఆర్ ఎన్యూమరేషన్‌పై గ్రామ సభ

రాంబిల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జిరాయితీ చింతువా పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఆర్‌ఆర్ ఎన్యుమరేషన్, పరిహారం తదితర అంశాలపై ఏపీఐఐసీ ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్‌డీ అనిత ఆధ్వర్యంలో మంగళవారం లోవపాలెంలో గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె జిరాయితీ భూముల్లోని ఇళ్లు, గ్రామ కంఠంలోని ఇళ్లను ఎలా ఎన్యుమరేషన్ చేయాలి.. ఆర్‌అండ్‌ఆర్ చట్టం ద్వారా ఏ విధంగా పరిహారం మంజూరవుతుంది.. నిర్వాసితుల కుటుంబాలకు ఏ విధంగా ఉపాధి అవకాశాలు కల్పిస్తారన్న అంశాలను ప్రజలకు వివరించారు. అనంతరం గ్రామస్థుల అభిప్రాయాలను తెలుసుకున్నారు. అలాగే వారి సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఆర్ఐ రవికుమార్, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ పరిధిలోని గ్రామాల పెద్దలు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా

గొలుగొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్ఐ రామారావు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు వాహనాల్లో గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. గంజాయి రవాణాపై నిరంతరం ప్రత్యేక నిఘా పెట్టామని, పోలీసులతో పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్‌మేళా రేపు

ఎలమంచిలి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలిలోని గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 15వ తేదీ ఉదయం 10 గంటల నుంచి నిరుద్యోగ యువతీ, యువకులకు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కేఎస్. కొండలరావు ఒక ప్రకటనలో తెలిపారు. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత ఈ జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొత్తపేట రామలింగేశ్వరస్వామి ఆలయంలో ధ్వజస్తంభం ప్రతిష్ఠాపన

ఎలమంచిలి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎలమంచిలి కొత్తపేటలో రామలింగేశ్వరస్వామి ఆలయ ఆవరణలో మంగళవారం నుంచి రెండు రోజులుపాటు ధ్వజస్తంభం ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. ఉదయం నుంచి వేద పండితుల సమక్షంలో ప్రత్యేక హోమ, అభిషేక కార్యక్రమాలు జరిపించారు. బుధవారం ధ్వజస్తంభం ప్రతిష్ఠ జరుగుతుందని, భక్తులంతా ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవాలని కమిటీ ప్రతినిధి కోరారు.

సెల్‌టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని నిరసన



అరట్లకోటలో ఆందోళన చేస్తున్న మహిళలు, యువకులు

పాయకరావుపేట రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అరట్లకోటలో సెల్ టవర్ నిర్మాణాన్ని నిలిపివేయాలని గ్రామస్థులు మంగళవారం ఆందోళన నిర్వహించారు. అరట్లకోటకి చెందిన రైతు పొలంలో నిర్మిస్తున్న సెల్‌టవర్ ప్రదేశానికి దగ్గరలో ఇళ్లు ఉండడంతో గతంలో జిల్లా కలెక్టరుకు స్పందనలో ఫిర్యాదు చేసినట్టు వేముల శ్రీను, లెక్కల నాగేశ్వరరావు, వేముల గంగామహేశ్, మేముల గోపి, తూము నాగేశ్వరరావు, తూము సాయి తెలిపారు. అనంతరం సెల్ టవర్ నిర్మాణ పనులు చేపట్టలేదని, ఈ మధ్య కాలంలో తిరిగి సెల్ టవర్ పనులు ప్రారంభించారని వారు తెలిపారు. సెల్‌టవర్ నుంచి వచ్చే రేడియేషన్‌తో చిన్నపిల్లలు, వృద్ధులు, గర్భిణులకు అనారోగ్య సమస్యలు తలెత్తుతాయని వారు తెలిపారు. సెల్ టవర్ నిర్మాణానికి అనుమతులిస్తే నివాస ప్రాంతాలకు దూరంగా ఇవ్వాలన్నారు. గ్రామ పంచాయతీ నుంచి సెల్ టవర్ నిర్మాణానికి ఎటువంటి ఎన్‌ఓసీ ఇవ్వలేదన్నారు. అధికారులు స్పందించి సెల్ టవర్ నిర్మాణాన్ని నిలుపుదల చేయాలని కోరుతున్నారు. కార్యక్రమంలో వేముల నాగరత్నం, వేముల వీరలక్ష్మి, తిరుమలశెట్టి లక్ష్మి, తిరుమలశెట్టి అనంతలక్ష్మి, లెక్కల వెంకటలక్ష్మి, తూము శివమ్మ, వేముల గన్నెమ్మ పాల్గొన్నారు.

అసంఘటిత కార్మికులకు ఈ-శ్రమ కార్డులు

⏩ ఎలమంచిలి లేబర్ అధికారి వెంకటేశ్వరరావు

అచ్యుతాపురం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): అసంఘటిత రంగ కార్మికులు ఈ-శ్రమ కార్డులను తీసుకోవాలని ఎలమంచిలి లేబర్ అధికారి సుంకర వెంకటేశ్వరరావు అన్నారు. మంగళవారం ఆయన మండలంలోని జగన్నాథపురం, ఎర్రవరం గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 16 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాల వయస్సులోపు కలిగిన వారు ఈఎస్ఐ, ఈపీఎఫ్ సభ్యత్వం లేని రంగాలు, వ్యవసాయ కార్మికులు, ఉపాధి హామీ శ్రామికులు, భవన నిర్మాణ కార్మికులు, స్వయం ఉపాధి, రవాణా రంగంలో పనిచేసేవారు ఈ-శ్రమ కార్డులు తీసుకోవాలన్నారు. ఈ-శ్రమ కార్డు పొంది ఉంటే ప్రమాద మరణానికి రూ.2 లక్షలు, అంగ వైకల్యానికి గురైతే రూ.1లక్ష ఆర్థిక సాయం అందిస్తారన్నారు. ఈ-శ్రమ కార్డు పొందేందుకు ఆధార్‌కార్డు నకలు, బ్యాంక్ ఖాతా నంబరు, సెల్‌ఫోన్ నంబరు వంటి వివరాలు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, కౌలు రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాండ్రేగుల రామసదాశివరావు, ఉపాధి కూలీలు, కార్మికులు పాల్గొన్నారు.

‘ధ్యానంతో సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం’

అచ్యుతాపురం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): ధ్యానం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం సాధ్యపడుతుందని అచ్యుతా స్కూల్ హిందీ ఉపాధ్యాయురాలు విజయ అన్నారు. మంగళవారం అచ్యుతాపురం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న విజ్ఞాన వేసవి శిబిరానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ధ్యానం చేయడం ద్వారా మరింతగా విజ్ఞానాన్ని పెంపొందించుకొనే అవకాశం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ డి.కోటేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో చందు జన్మదిన వేడుకలు



చందు జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కుటుంబ సభ్యులు

అచ్యుతాపురం రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండకర్లలోని ఇచ్ఛా ఫౌండేషన్ అనాథ పిల్లల ఆశ్రమంలో మంగళవారం అఖిల భారత రామ్‌చరణ్ యువత రాష్ట్ర నాయకుడు లాలం చందు జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన అభిమానులు, కుటుంబ సభ్యులు అనాథ పిల్లలతో కలిసి కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా అనాథ పిల్లలకు నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ లాలం రమేష్ నాయుడు, లాలం అభిరామ్, జనసేన నాయకులు పవన్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా అభయాంజనేయ ఆలయ వార్షికోత్సవం



అభయాంజనేయస్వామికి పూజలు చేస్తున్న భక్తులు

ఎస్.రాయవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దార్లపూడిలోని అభయాంజనేయస్వామి ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని మంగళవారం గ్రామస్థులు వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి స్థానికులతో పాటు చుట్టుపక్కల గ్రామాల భక్తులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్నసమారాధన ఏర్పాటు చేశారు. గ్రామ పెద్దలు పోలిశెట్టి పెదఈశ్వరరావు పాల్గొన్నారు.

క్షతగాత్రుడిని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

ఎస్.రాయవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఇటీవల గాయపడిన రేవుపోలవరం గ్రామానికి చెందిన మామిడి శ్రీను (వలంటీర్)ను మంగళవారం మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు, వైస్ ఎంపీపీ బొలిశెట్టి గోవిందరావు తదితర నాయకులు, ప్రజాప్రతినిధులు మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే జోగులు శ్రీను ఆరోగ్య పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వైసీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కొణతాల శ్రీనివాసరావు, వైస్ ఎంపీపీ అప్పలరాజు, సర్పంచ్ చోడిపల్లి గోవింద్, వైసీపీ నాయకులు జగన్నాథం, దేవుడు, హరికృష్ణ, చేపల రాజు, జగన్, నూకరాజు పాల్గొన్నారు.



గిడుతూరు సాగునీటి కాలువులో పనులు చేస్తున్న కూలీలు

గిడుతూరు సాగునీటి కాలువకు మోక్షం

▸ చురుగ్గా అభివృద్ధి పనులు

మాకవరపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఎండపల్లి-గిడుతూరు సాగునీటి కాలువకు మోక్షం లభించింది. ఈ కాలువలో వారం రోజులుగా అభివృద్ధి పనులను చురుగ్గా చేపడుతున్నారు. మాకవరపాలెం మండలం గిడుతూరు, కోటవురట్ల మండల ఎండపల్లి గ్రామాల మధ్య ఉన్న సాగునీటి కాలువ అభివృద్ధి కోసం ఉపాధి హామీ పథకం కింద జోరుగా పనులు సాగుతున్నాయి. సాగునీటి సౌకర్యాన్ని మెరుగుపరచాలనే లక్ష్యంతో పనులు చేస్తున్నామని గిడుతూరు టీడీపీ నాయకుడు చిటికెల బుచ్చి రాంప్రసాద్ మంగళవారం తెలిపారు. అలాగే ఇప్పటివరకు కాలువకు మరమ్మతులు లేకపోవడంతో వరిసాగుకు సాగునీరు సక్రమంగా అందడం లేదని, దీంతో ప్రతి ఏటా రైతులు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని ఆయన చెప్పారు. ఈ నేపథ్యంలో కాలువ అభివృద్ధి పనులు పూర్తయితే రైతులకు సాగునీటి సమస్య తప్పుతుందని చెప్పారు.

గ్రావెల్ అక్రమ తవ్వకాల నిరోధానికి చర్యలు



గ్రావెల్ రవాణా నిరోధానికి ట్రెంచ్‌లు తవ్వుతున్న దృశ్యం

చోడవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకన్నపాలెంలో అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు జరగకుండా ప్రజా ప్రతినిధులు, అధికారులు తగిన చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తున్న ప్రదేశాల్లో మంగళవారం ప్రజాప్రతినిధుల సమక్షంలో రెవెన్యూ సిబ్బంది ఎక్స్‌కవేటర్‌తో ట్రెంచ్‌లు తవ్వించారు. వెంకన్నపాలెంలో ఇటీవల ఇద్దరు వ్యక్తులు అక్రమంగా గ్రావెల్ తవ్వకాలు నిర్వహిస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ మొల్లి ఈశ్వరరావు, ఎంపీటీసీ సభ్యుడు మురుకుటి వెంకటరమణలతో పాటు వీఆర్‌వో భరత్‌రాజ్, సిబ్బంది పంచాయతీ పరిధిలోని పిల్లకాని చెరువు, సాయిబాబు గుడి చెరువు, మరో రెండు ప్రదేశాల్లో గ్రావెల్ మట్టి తవ్వకాలు చేపట్టకుండా అడ్డుగా ట్రెంచ్‌లు తవ్వించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ మాధురి

నర్సీపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): సీజన్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని అర్బన్ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మాధురి సూచించారు. మంగళవారం మునిసిపల్ కమిషనర్ సురేంద్ర ఆధ్వర్యంలో వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది, సచివాలయాల ఆరోగ్య కార్యదర్శులు, ఆశ కార్యకర్తలతో సీజనల్ వ్యాధులు లక్షణాలు, నివారణకు తీసుకోవాల్సిన ముందస్తు చర్యలపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముందస్తు జాగ్రత్తగా ఇంటింకీ వెళ్లి సర్వే చేసి జ్వర పీడితులు, ఇతర వ్యాధులతో బాధ పడుతున్న వారిని గుర్తించాలని చెప్పారు. వారికి అవసరమైన వైద్య సహాయం అందించాలని ఆమె సూచించారు. సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా



గొలుగొండలో వాహనాలు తనిఖీ చేస్తున్న ఎస్ఐ రామారావు, సిబ్బంది

గొలుగొండ, మే 13 (ఆంధ్రజ్యోతి): గంజాయి రవాణాపై ప్రత్యేక నిఘా పెట్టామని ఎస్ఐ రామారావు తెలిపారు. మండల కేంద్రంలో మంగళవారం వాహనాలను తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏజెన్సీ నుంచి మైదాన ప్రాంతాలకు వాహనాల్లో గంజాయి తరలిస్తున్నట్టు అందిన సమాచారం మేరకు తనిఖీలు చేస్తున్నామని చెప్పారు. గంజాయి రవాణాపై నిరంతరం ప్రత్యేక నిఘా పెట్టామని, పోలీసులతో పెట్రోలింగ్ ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

కాలువలను కప్పేసిన తుప్పలు

మురుగు ముందుకు పారక దుర్గంధం



డ్రైనేజీని పూర్తిగా కప్పేసిన తుప్పలు

మాడుగుల రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హైస్కూల్ కాలనీలో కాలువలను తుప్పలు కప్పేస్తున్నాయి. పిచ్చి మొక్కలు పెరిగిపోవడంతో పాటు వాటి ఆకులు రాలిపోతుండడంతో నీరు ముందుకు పారే అవకాశం లేకపోతోంది. దీంతో మురుగు పేరుకుపోయి దుర్గంధం వెదజల్లుతున్నది. అలాగే దోమలు బెడద ఎక్కువగా ఉంటుందని, దీంతో రోగాల భయం వెంటాడుతున్నదని స్థానిక ప్రజలు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్య తెలిసినా అధికారులు కనీసం పట్టించుకోవడం లేదని మండిపడుతున్నారు. దీనికితోడు తుప్పలు పెరిగిపోవడం వల్ల విషసర్పాలు ఎక్కువగా సంచరిస్తున్నాయని వారు చెప్పారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి కాలువల్లో తుప్పలను తొలగించాలని, పూడిక తీయించాలని, మురుగు సక్రమంగా పారేలా తగిన చర్యలు చేపట్టాలని స్థానిక ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

ఇదేం చెత్త సమస్య..?

పక్క చిత్రంలో హెచ్చరిక బోర్డు చూశారా..? దీని కథ భలే వింతగా అ(క)నిపిస్తుంది. 'ఇచ్చట చెత్త వేయరాదు.. అతిక్రమించినచో రూ.1000 జరిమానా' అని రాసి బోర్డు పెట్టిన సాక్షాత్తు పంచాయతీ అధికారే, నిబంధనను అతిక్రమిస్తుండడం వింతే కదా! పంచాయతీలోని వీధుల్లో సేకరించిన చెత్తను తీసుకొచ్చి సదరు అధికారే కుప్పలుగా పోయిస్తూ 'చెత్త' వాతావరణం సృష్టిస్తుండడం ఆశ్చర్యకరం. అయితే ఆయనకు కూడా వేరే మార్గం లేకపోతున్న ఈ 'చెత్త' సమస్యను ఓసారి పరికిస్తే....

మళ్లీ జనావాసాల మధ్యనే చెత్తాచెదారం

- ▸ గుట్టలుగా పేరుకుపోతున్న చెత్త కుప్పలు
- ▸ రావికమతం పంచాయతీని వీడని డంపిగ్ యార్డు స్థల సమస్య
- ▸ తలలు పట్టుకుంటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు
- ▸ మండల కేంద్రంలోనే చెత్త వాతావరణంతో జనం బెంబేలు



'ఇక్కడ చెత్త వేస్తే జరిమానా' అని పంచాయతీ కార్యదర్శి ఏర్పాటు చేసిన బోర్డు పక్కనే చెత్త కుప్పలు

రావికమతం, మే 13 (ఆంధ్రజ్యోతి):

రావికమతాన్ని చెత్త సమస్య వదలడం లేదు. అధికారులు, పాలకులు ఎన్ని ప్రయత్నాలు చేసినా సమస్య మళ్లీ మొదటికొచ్చేస్తున్నది. మండల కేంద్రమే 'డంపింగ్ యార్డు'ను తలపించేలా తయారు కావడంతో అందరూ తలలు పట్టుకుంటున్నారు.

మండల కేంద్రంలో రోజురోజుకూ పెరుగుతున్న జనాభా, వ్యాపార సంస్థలు, కొత్తగా ఏర్పడుతున్న ఆవాసాలతో చెత్తాచెదారం కూడా పేరుకుపోతోంది. రోజుకు 10 నుంచి 15 టన్నుల మేర చెత్తను పారిశుధ్య కార్మికులు సేకరిస్తున్నారు. ఈ చెత్తను తరలించేందుకు పంచాయతీకి సొంత ట్రాక్టర్ కూడా ప్రభుత్వం సమకూర్చింది. అలాగే ఇక్కడ సంపద కేంద్రం ఉన్నప్పటికీ, దానికి అవసరమైనంత స్థలం లేకపోవడం, సక్రమంగా వినియోగించకపోవడంతో నిరుపయోగంగా మారింది.

వీధుల్లో ప్రతి రోజూ సేకరించిన చెత్తను గతంలో తహసీల్దార్ కార్యాలయం పక్కన, హైస్కూల్ ప్రహరీని ఆనుకుని, గంజివారి దేవాలయం వెనుకన కుప్పలుగా డంప్ చేసేవారు. గ్రామం మధ్యలో చెత్త వేస్తుండడాన్ని ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించడంతో డంపింగ్ యార్డు స్థలం కోసం జిల్లా, మండల అధికారులకు గ్రామ పంచాయతీ తరపున పలుమార్లు దరఖాస్తులు చేశారు. చివరకు పొరుగు గ్రామ రెవెన్యూలోనైనా 20, 30 సెంట్ల ప్రభుత్వ స్థలం కేటాయించాలని ఏళ్ల తరబడి విజ్ఞప్తులు చేస్తున్నారు. అయితే రావికమతానికి చెందిన చెత్త వేసేందుకు డంపింగ్ యార్డు కోసం రెవెన్యూ అధికారులు స్థలం కేటాయిస్తున్నా, అక్కడ ప్రజలు అడ్డుకుంటున్నారు. దీంతో గత్యంతరం లేక చెత్తను గ్రామం మధ్యలోనే వేయక తప్పేదికాదు.



రావికమతం మీ సేవ కేంద్రం వద్ద జనావాసాల మధ్యనే చెత్త కుప్పలు



గతంలో డంపింగ్ యార్డు కోసం కేటాయించిన ప్రభుత్వ స్థలం

చివరికి రావికమతం గ్రామ శివారులో గుర్రయ్య కట్టు వద్ద 2023 ఆగస్టులో 20 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని డంపింగ్ యార్డు కోసం రెవెన్యూ అధికారులు కేటాయించారు. ఈ స్థలంలో అప్పటి నుంచి గ్రామంలో సేకరించిన చెత్తను డంప్ చేస్తున్నారు. ఇక చెత్త సమస్య తొలగిందని రావికమతం ప్రజలు ఊపిరి తీసుకున్న కొద్ది రోజుల్లోనే, మరలా అభ్యంతరాలు రావడంతో సమస్య మొదటికొచ్చేసింది. ఇప్పుడు సేకరించిన చెత్తను ఎక్కడ పోయాలో అంతు పట్టక పంచాయతీ సిబ్బంది తలలు పట్టుకుంటున్నారు. దీంతో మళ్లీ గ్రామంలోని ఆవాసాల మధ్యనే మీ సేవ కేంద్రం వద్ద చెత్తను వేస్తున్నారు. 'ఇక్కడ చెత్త వేయరాదు. అతిక్రమించినచో రూ.1000 జరిమానా' అని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసిన గ్రామ పంచాయతీయే, మళ్లీ చెత్త వేయడంపై పలువురు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల కేంద్రంలోనే చెత్త వాతావరణం ఏర్పడుతుండడంతో వారు బెంబేలెత్తుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు ఈ సమస్య పరిష్కారానికి తక్షణమే తగిన చర్యలు చేపట్టాలని, మండల కేంద్రాన్ని పరిశుభ్రంగా ఉంచాలని వారు వేడుకుంటున్నారు.

ఈ విషయమై పంచాయతీ కార్యదర్శి కృష్ణమోహన్‌ను వివరణ కోరగా, డంపింగ్ యార్డుకు కేటాయించిన ప్రభుత్వ స్థలంపై కొంత మంది అభ్యంతరం తెలిపి కోర్టుకు వెళ్లారని, ఈ సమస్య తొలగేవరకూ తాత్కాలికంగా గ్రామం మధ్యలోనే చెత్త వేయక తప్పడం లేదని పేర్కొన్నారు.

గుమ్మిడిగొండలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు

▸ చేతికి అందేలా వేలాడుతున్నా పట్టించుకోని అధికారులు

▸ పంట పొలాల్లో వైర్లతో రైతుల భయాందోళన

నాతవరం, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మిడిగొండ గ్రామంలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరాఫరా చేసే వైర్లు ప్రమాదకరంగా తయారయ్యాయి. చేతికి అందేంత ఎత్తులో వైర్లు వేలాడుతున్నాయి. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని రైతులు భయాందోళన చెందుతున్నారు.

ఈ గ్రామంలో వారం రోజుల క్రితం ఈదురుగాలులకు వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరాఫరా చేసే స్తంభాల వైర్లు కిందకు వేలాడాయి. భూమికి అడుగున్నర ఎత్తులో ఈ వైర్లు ఉన్నాయి. వీటికి విద్యుత్ సరఫరా అవుతుండడంతో మంగళవారం రైతు పేరుబాబుకు చెందిన ఆవుకు వైర్లు తగిలి విద్యుదాఘాతానికి గురైంది. వెంటనే పశు సంవర్ధక శాఖ సిబ్బంది వచ్చి ఆవుకు సేవలు అందించారు. కాగా పొలాల్లో తిరిగేటప్పుడు వైర్లు ఏమాత్రం తాకితా షాక్ తగిలే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. అలాగే వైసీపీ ప్రభుత్వ హయాంలో వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరాఫరా చేసే స్తంభాలను భూమికి రెండు అడుగుల ఎత్తులో ఏర్పాటు చేశారని వారు చెప్పారు. పశువులు, పిల్లలకు అందేంత ఎత్తులో వైర్లు ఉన్నాయని, ఏమాత్రం వైర్లు తగిలిచినా ప్రమాదానికి ఆస్కారం లేకపోలేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు స్పందించి గ్రామంలో విద్యుత్ వైర్లను సరిచేయాలని, మీటర్ల వల్ల ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు.



విద్యుత్ స్తంభాల నుంచి ప్రమాదకర రీతిలో కిందకు వేలాడుతున్న వైర్లు



తక్కువ ఎత్తులో ఉన్న మీటర్.. వైరు తగిలి అస్వస్థతకు గురైన ఆవు

ప్రకృతి వ్యవసాయం ఎంతో మేలు: ఏవో కృష్ణవేణి

చీడికాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో ఎంతో మేలు చేకూరుతుందని మండల వ్యవసాయ శాఖాధికారి ఎ.కృష్ణవేణి చెప్పారు. మండలంలోని కోనాం గ్రామం సచివాలయంలో రైతులు, ప్రజా ప్రతినిధులతో మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవకాసం సాగుతో ఎరువుల వాడకాన్ని నిషేధించే అవకాశం ఉంటుందన్నారు. ప్రతీ రైతు తన పొలంలో ఎంతో కొంత భూమిని సాగు చేసుకోవాలని సూచించారు. పొలాల్లో చల్లేందుకు 30 రకాల దినుసులతో ఉన్న విత్తనాల కిట్‌ను రైతులకు ఉచితంగా అందజేస్తామని, వీటిని పొలాల్లో వేసి కలిపిదున్నితే నాట్లు వేసే సమయానికి ఎరువుగా మారుతుందని ఆమె వివరించారు. తద్వారా ఎటువంటి కాంప్లెక్స్ ఎరువులు వాడాల్సిన అవసరం ఉండదని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కిమిడి చిన్నమ్మలు, సర్పంచ్ చలుగు ఈశ్వరమ్మ, మాజీ సర్పంచ్ కె.శ్రీరామ్మూర్తి, వ్యవసాయ శాఖ సిబ్బంది వర్మ తదితరులు పాల్గొన్నారు.



విత్తనాల కిట్ చూపుతున్న ప్రజా ప్రతినిధులు, రైతులు

వేతనాల కోసం ఉపాధి కూలీల వినూత్న నిరసన

దేవరాపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): వేతన బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఉపాధి హామీ పథకం కూలీలు మంగళవారం వినూత్నంగా నిరసన తెలిపారు. అన్నం క్యారేజీలు పట్టుకుని బకాయిల కోసం నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు డి.వెంకన్న మాట్లాడుతూ నెలలు తరబడి కూలి సొమ్ము చెల్లించకపోతే కూలీలు ఏం తిని బతుకుతారని ప్రశ్నించారు. పని చేసిన కూలీలతో పాటు సిబ్బందికి జీతాలు ఇవ్వలేని దుస్థితిలో ప్రభుత్వాలు ఉన్నాయని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా కూలీల వేతనాలను చెల్లించాలని కోరారు.



అన్నం క్యారేజీలతో నిరసన తెలుపుతున్న కూలీలు

దేశవ్యాప్త సమ్మె పోస్టర్లు విడుదల

మాకవరపాలెం, మే 13 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని అంగన్‌వాడీ కార్యకర్తల సంఘం జిల్లా నాయకురాలు ధనలక్ష్మి పద్మ కోరారు. ఈ మేరకు మంగళవారం మాకవరపాలెం పీహెచ్‌సీ వద్ద దేశవ్యాప్త సమ్మె పోస్టర్లను విడుదల చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఉద్యోగ భద్రతతో పాటు పలు సమస్యల పరిష్కారం కోరుతూ ఈ సమ్మె చేపడుతున్నామని చెప్పారు. మండలంలోని స్కీమ్ వర్కర్లు ఈ సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నేత ధనమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.



మాకవరపాలెంలో సమ్మె పోస్టర్లు విడుదల చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

చీడికాడలో...

చీడికాడ: దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి రొంగలి దేముడునాయుడు కోరారు. ఈ సందర్భంగా వివిధ సంఘాలకు చెందిన నాయకులు ఎం.జానకి, ఉమ, పైడితల్లమ్మతో కలిసి పోస్టర్ విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ కార్మికులకు అండగా నిలిచే చట్టాలను కేంద్ర ప్రభుత్వం నాలుగు కోడ్‌లుగా మార్చి కనీస ప్రాథమిక హక్కు లేకుండా చేస్తున్నదన్నారు. కార్మికులకు ఉద్యోగ భద్రత, సమ్మెచేసే హక్కు లేకుండా యజమానులకు అనుకూలంగా మార్చడానికి కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో చట్టం చేయడానికి సిద్ధమవుతుందన్నారు. ఈ చట్టాలను రద్దుచేయాలని కోరుతూ జరుగుతున్న సమ్మెను కార్మికులంతా జయప్రదం చేయాలని కోరారు.

18న మోదమాంబ పండుగ

చీడికాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలో ఈ నెల 18న మోదమాంబ అమ్మవారి పండగను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ పెద్దలు తెలిపారు. ఆదివారం ఉదయం నుంచి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తామని, మధ్యాహ్నం భారీ అన్నసమారాధన ఉంటుందని చెప్పారు. అలాగే సాయంత్రం జిల్లా స్థాయి ఎడ్ల పరుగు పోటీలు, కోలాటాలతో నిర్వహించనున్నట్టు వారు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని జాతరను విజయవంతం చేయాలని కోరారు.

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

కొత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ మంగళవారం తెలిపారు. కూండ్రం గ్రామానికి చెందిన పద్నాలుగేళ్ల బాలికపై తగరంపూడి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అత్యాచార యత్నానికి పాల్పడ్డారన్నారు. ఈ ఘటనపై అందిన సమాచారం మేరకు ఆ ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

అనకాపల్లి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సు ఇంగ్లీషు-1, ఒకేషనల్ కోర్సు ఇంగ్లీషు-1 పరీక్షలకు మొత్తం 5,245 మంది హాజరుకావాల్సి ఉండగా, 5044 మంది పరీక్షలు రాశారని జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుజాత తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సు ఇంగ్లీషు-2, ఒకేషనల్ కోర్సు ఇంగ్లీషు-2 పరీక్షలకు 747 మంది హాజరుకావాల్సి ఉండగా 675 మంది వచ్చేశారన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కశింకోట, మే 13 (ఆంధ్రజ్యోతి) : పేదలను ఆదుకునేందుకే ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రవేశపెట్టారని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. కన్నూరుపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న అక్కెరపు వెంకటరమణ కుటుంబ సభ్యులకు మంగళవారం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఐదు లక్షల రూపాయల చెక్కును అందజేశారు.

సీబీఎస్ఈ ఫలితాల్లో జీకేవీధి, చింతపల్లి ఈఎంఆర్ఎస్‌ల్లో శతశాతం ఉత్తీర్ణత

గూడెంకొత్తవీధి, మే 13 (ఆంధ్రజ్యోతి):స్థానిక ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ విద్యాలయం(ఈఎంఆర్ఎస్)లో పది, 12 తరగతుల్లో విద్యార్థినీ, విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత సాధించారని ప్రిన్సిపాల్ ఎంవీ రమణ తెలిపారు. మంగళవారం సీబీఎస్ఈ పది, 12 తరగతుల ఫలితాలు విడుదలయ్యాయి. ఈమేరకు స్థానిక ఈఎంఆర్ విద్యాలయంలో 12వ తరగతిలో 74 మంది, పదోవ తరగతిలో 60 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా శతశాతం ఉత్తీర్ణులయ్యాయన్నారు. బైపీసీలో కె. మోహన్ క్రిష్ణ 84.4 శాతం, ఎంపీసీలో పిండి పార్థు 81.8 శాతం, హెచ్ఈపీలో కె.రాంబాబు 82శాతం మార్కులు సాధించారన్నారు.

చింతపల్లిలో..

చింతపల్లి ఏకలవ్య ఆదర్శ నివాసానుబంధ పాఠశాలలో పదో తరగతిలో శత శాతం ఉత్తీర్ణులైనట్టు ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ తెలిపారు. మంగళవారం సీబీఎస్ఈ ఫలితాలు విడుదలయ్యాయి. ఈమేరకు ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాఠశాలలో 60మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలకు హాజరుకాగా శతశాతం ఉత్తీర్ణులయ్యారని ఆయన తెలిపారు. శతశాతం ఉత్తీర్ణత కావడంపై ఉపాధ్యాయులు, విద్యార్థులను అభినందిస్తున్నామన్నారు.

గిరిజన సలహా మండలిని ఏర్పాటు చేయాలి

▸▸ రాష్ట్ర ఆదివాసీ జేఏసీ నాయకులు


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీ ఆదివాసీ జేఏసీ నాయకులు

పాడేరురూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): గిరిజన సలహా మండలిని ముఖ్యమంత్రి వెంటనే ఏర్పాటు చేసి షెడ్యూల్ ప్రాంతంలో ఉద్యోగ నియామక చట్టం చేయాలని రాష్ట్ర ఆదివాసీ జేఏసీ జిల్లా చైర్మన్ రామారావు దొర, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ముఖి శేషాద్రి కోరారు. మంగళవారం స్థానిక జీఎస్‌యూ లైబ్రరీ భవనం వద్ద వారు విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రకటనను స్వాగతిస్తూ కూటమి ప్రభుత్వ హయాంలో ఆదివాసీలకు తగిన న్యాయం జరగాలని ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. ఆదివాసీలకు న్యాయం చేసేందుకు ట్రైబల్ అడ్వయిజర్ కౌన్సిల్(టీఏసీ)ని ఏర్పాటు చేయాలని కోరారు. మెగా డీఎస్సీ ద్వారా ప్రకటించిన ఏజెన్సీ ఉపాధ్యాయ పోస్టులను ఆ నోటిఫికేషన్ నుంచి మినహాయించి షెడ్యూల్ ప్రాంతానికి ప్రత్యేక నోటిఫికేషన్ ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బోయపల్లి సింహాచలం, జీఎస్‌యూ రాష్ట్ర సమన్వయకర్త కిరసాని కిశోర్, వివిధ సంఘాల ముఖ్యనాయకులు ఎం.వెంకటరమణ, మాసాడ ఈశ్వరరావు, సురేష్, నాగరాజు, బుడిదే మాధవరావు, ఎం.బాబూజీ తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే పసుపు అధిక దిగుబడులు

▸▸ ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి చెట్టి బిందు



రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు అందజేస్తున్న శాస్త్రవేత్తలు బిందు, అప్పారావు

చింతపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీ రైతులు పసుపు సాగులో శాస్త్రీయ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు సాధించవచ్చునని స్థానిక ఉద్యాన పరిశోధన స్థానం అధిపతి, శాస్త్రవేత్త చెట్టి బిందు అన్నారు. మంగళవారం ఉద్యాన పరిశోధన స్థానంలో విజయ వాహిని చారిటబుల్ ఫౌండేషన్, టాటా ట్రస్టు సంయుక్తంగా ఆదివాసీ రైతులకు నిర్వహించిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. గిరిజన రైతులు పసుపు సాగులో పురాతన పద్ధతులు పాటించడం వల్ల అధిక ఆదాయం పొందలేకపోతున్నారన్నారు. రైతులు రెండేళ్ల సాగు పద్ధతిని విడిచి పెట్టి, ఎనిమిది నెలల కాల పరిమితి కలిగిన రోమ, ప్రగతి రకాలను నాటు కోవాలన్నారు. దీనివల్ల ఏడాదికి రెండు పంటలు పొందవచ్చునన్నారు. టాటా ట్రస్టు శాస్త్రవేత్త డాక్టర్ అప్పలరాజు మాట్లాడుతూ రైతులు విత్తన శుద్ధి చేసుకున్న దుంపలను నాటుకోవాలన్నారు. దుంపకుళ్లు తెగులను సకాలంలో గుర్తించకపోతే పంటకు తీవ్ర నష్టం కలుగుతుందన్నారు. స్ట్రీమ్ బాయిలర్లలో పసుపును ఉడకబెట్టుకోవాలన్నారు. పాలిషర్ సహాయంతో ప్రాసెసింగ్ చేయడం వల్ల మంచి ఛాయ వస్తుందని, మార్కెట్‌లోనూ మంచి ధర లభిస్తుందన్నారు. అనంతరం శిక్షణ పొందిన గిరిజన రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేశారు.

అరకులో భారీ వర్షం


అరకులోయలో కురుస్తున్న వర్షం

అరకులోయ, మే 13 (ఆంధ్రజ్యోతి): అరకులోయలో మంగళవారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రంగా కాయగా, మధ్యాహ్నం తర్వాత హోరున వాన పడింది. అప్పటివరకు ఎండ తీవ్రతతో ఉక్కిరిబిక్కిరైన ప్రజలు ఉపశమనం పొందారు. కాగా వాతావరణం పూర్తిగా చల్లబడడంతో స్థానికులు ఊరట చెందుతున్నారు.

గుమ్మలో కిశోర వికాసం


కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ మంజుభార్గవి

అనంతగిరి, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మ పంచాయతీ కేంద్రంలో కిశోర వికాస ప్రత్యేక కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో లంగుపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారిణి మంజుభార్గవి పాల్గొని పలు విషయాలపై బాలికలకు అవగాహన కల్పించారు. ఫోన్ ప్రభావం కారణంగా చిన్నారుల్లో అసమర్థత పెరుగుతుందని, తెలిసి తెలియని వయస్సులోని ప్రేమ వివాహాలు చేయకూడదని తదెలిపారు. అనంతరం వైద్య శిబిరం ఏర్పాటు నిర్వహించి చిన్నారులకు రక్త పరీక్షలు చేశారు. అలాగే అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఈవో సంజీవరావు, సూపర్‌వైజర్ గాయత్రి పాల్గొన్నారు.

జన జాతర

▸▸ మోదకొండమ్మ జాతర ఆఖరి రోజు పోటెత్తిన భక్తులు

▸▸ జనంతో కిటకిటలాడిన పాడేరు


కాలేజీ గ్రౌండ్‌లోని ప్లే జోన్‌లో జనం రద్దీ


ఉత్సవాల్లో మంగళవారం రాత్రి భక్త జనం

పాడేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ ఉత్సవాలు ఆఖరి రోజు మంగళవారం భక్తులు పోటెత్తారు. సాయంత్రం నిర్వహించిన అనుపోత్సవంలో పాల్గొన్న భక్తులే కాకుండా, ఆ తర్వాత ఊహించని విధంగా వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చారు. దీంతో జనంతో జిల్లా కేంద్రం కిటకిటలాడింది. ఉత్సవాలు సందర్భంగా ఏర్పాటు చేసిన విద్యుత్ దీపాలంకరణ, వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు విచ్చేశారు. రాతంత్రా జనం ఉత్సవాల్లో గడిపి బుధవారం ఉదయం నుంచి స్వగ్రామాలకు తిరుగు ప్రయాణమవుతారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు


ఊరేగింపులో కేరళ ఓనం బ్యాండ్


ఊరేగింపులో శక్తి వేషాలు


బుడబుక్కలాట, తప్పెటగుళ్ల ప్రదర్శన


బాలికల కోలాట ప్రదర్శన

మోదకొండమ్మ భక్తుల సేవలో..

పాడేరురూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ రాష్ట్ర గిరిజన జాతర సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో సత్యసాయి సేవా ట్రస్టు ప్రతినిధులు మూడు రోజులుగా భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఉత్సవాలకు వచ్చిన భక్తులు అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు ప్రతినిధులు పాల్గొని భక్తులకు అన్న ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

హోటల్ యజమాని ప్రసాదం వితరణ

మోదకొండమ్మ ఉత్సవాలకు వచ్చిన భక్తులకు మంగళవారం మెయిన్ రోడ్డులోని నాగరాజు గ్రాండ్ ఫ్యామిలీ రెస్టారెంట్ యజమాని సిద్ధినాతి కొండలరావు ఏర్పాటు చేసిన అన్నప్రసాదం పంపిణీని స్థానిక ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ కిశోర్‌కుమార్ ప్రారంభించారు. భక్తులకు ఆయన రెస్టారెంట్ యజమాని కుటుంబ సభ్యులతో కలిసి ప్రసాదం పంపిణీ చేపట్టారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణి

మోదకొండమ్మ ఉత్సవ ముగింపు రోజు మంగళవారం వాసవీక్లబ్, వనితా హిల్స్ క్లబ్‌ల ఆధ్వర్యంలో అమ్మవారి దర్శనానికి వచ్చిన భక్తులకు మజ్జిగ, ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వాసవీక్లబ్ ప్రతినిధులు శ్రీనాధు శ్రీను, శ్రీనాధు రాజు, శ్రీనాధు కొండాజీ, పుట్టా నానాజీ, మహిళా ప్రతినిధులు మణి, శిరీష తదితరులు పాల్గొన్నారు.


భక్తులకు అన్న ప్రసాదం పంపిణీ చేస్తున్న సత్యసాయి సేవా ట్రస్టు ప్రతినిధులు

కిశోర బాలికల సంరక్షణపై శ్రద్ధ అవసరం : సీడీపీవో

చింతపల్లి, మే 13 (ఆంధ్రజ్యోతి):కిశోర బాలికల సంరక్షణపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో జీవీ రమణ అన్నారు. మంగళవారం మండలంలోని కొత్తపాలెం, తాజంగి, టి.కోరుకొండ, బలభద్రం గ్రామాల్లో కిశోర వికాసం, వేసవి సెలవుల ప్రత్యేక కార్యక్రమాన్ని ఐసీడీఎస్ అధికారులు నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ యుక్తవయస్సులో ప్రవేశించిన బాలికల స్వేచ్ఛకు భంగం కలగకుండగా జగ్రత్తలు తీసుకోవాలన్నారు. బాలికలు విద్యలో రాణించేందుకు కృషి చేయాలన్నారు. వివాహ వయస్సు రాకుండా బాల్యవివాహాలు చేయరాదన్నారు. ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు తెలుసుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీవో ఎం. రామలక్ష్మి, సూపర్‌వైజర్లు, కె.విజయకుమారి, ఎస్కే. గౌహర్ ఉన్నీష, ఎస్. గౌరి, పి. అప్పలనర్స, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కిశోర బాలికలు విద్యాభ్యాసం చేయాలి

గూడెంకొత్త వీధి, మే 13 (ఆంధ్రజ్యోతి):కిశోర బాలికలందరూ విద్యాభ్యాసం చేయాలని స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు అధికారి లక్ష్మీదేవి అన్నారు. మంగళవారం మండలంలోని పీకేగూడెం గ్రామంలో కిశోర వికాసం, వేసవి శిబిరం కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ 11 నుంచి 18 ఏళ్ల వయస్సు కలిగిన బాలికలు విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ తీసుకోవాలన్నారు. సమాజంలో ఎదురయ్యే పరిస్థితులపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత పరిచయాలకు దూరంగా ఉండాలన్నారు. అలాగే సీలేరు, దుప్పులవాడ పంచాయతీల్లోనూ ఈకార్యక్రమాలు జరిగాయి. ఈకార్యక్రమంలో సూపర్‌వైజర్లు మోహిని, మహిళా సంరక్షణ కార్యదర్శి శాంతి పాల్గొన్నారు.


బలభద్రంలో ర్యాలీ చేస్తున్న ఐసీడీఎస్ అధికారులు, కిశోర బాలికలు

ఠారెత్తిస్తున్న ఎండలు

ముంచంగిపుట్టు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎండలు ఠారెత్తిస్తున్నాయి. మంగళవారం మండల కేంద్రంలో 32 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడికి తాళలేక పిల్లలు, వయసుపై బడిన వారు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారు. ఉక్కపోతతో ప్రజలు విలవిలాడిపోతున్నారు. గత కొద్ది రోజులుగా సాయంత్రం వేళల్లో వర్షం కురవడంతో వాతావరణం కాస్త చల్లబడేది. గత రెండు రోజులుగా ఎండలు విజృంభించడంతో పూర్వ స్థితికి వాతావరణం వచ్చేసింది. మండల కేంద్రంతో పాటు ప్రభుత్వ కార్యాలయాల వద్ద చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

విస్తృతంగా వాహన తనిఖీలు

ముంచంగిపుట్టు, మే 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రం నుంచి పెదబయలు, జోలాపుట్టు, కుమడ, సంగడ తదితర ప్రాంతాలకు వెళ్లే ప్రధాన రహదారులపై పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు చేపడుతున్నారు. ఇటీవల అల్లూరి జిల్లాలో ఎన్‌కౌంటర్ నేపథ్యంలో పోలీసులు అప్రమత్తమయ్యారు. ప్రతీకారం తీర్చుకొనేందుకు మావోయిస్టులు ఎదురు దాడికి దిగే అవకాశం ఉందని పోలీస్ ఇంటెలిజెన్సీ భావిస్తున్నట్టు సమాచారం. దీంతో మారుమూల గ్రామాలకు ప్రజాప్రతినిధులు వెళ్లరాదని పోలీసులు నోటీసులు జారీ చేశారు. అలాగే ముంచంగిపుట్టు మీదుగా వివిధ ప్రాంతాలకు వెళ్లే వాహనాలను, ప్రయాణికుల లగేజీలను క్షుణ్ణంగా తనిఖీలు చేపడుతున్నారు. పాడేరు మోదకొండమ్మ తల్లి ఉత్సవాల నేపథ్యంలో పోలీసులు వాహన తనిఖీరు మరికాస్త ముమ్మరం చేశారు. మారుమూల గ్రామాల మీదుగా ఆంధ్రా, ఒడిశా రాష్ట్రాలకు చెందిన పోలీసులు బలగాలు గాలింపులు చేపడుతున్నట్టు సమాచారం.

బాధ్యతల బందీలో బాల్యం!

బొమ్మలతో ఆడుకోవాల్సిన వయసులో అదే బొమ్మల విక్రయానికి సహకరిస్తున్న పదేళ్ల బాలుడు మోదకొండమ్మ ఉత్సవాల్లో దర్శనమిచ్చాడు. తల్లిదండ్రులు బొమ్మల అమ్మకాలు చేపడుతుండగా, వాటిని తయారు చేసే పనిలో ఆ బాలుడు నిమగ్నమయ్యాడు. వాస్తవానికి ఉత్సవాల్లో అమ్మానాన్నలతో బొమ్మలు కొనిపించుకోవాల్సిన వయస్సులో ఉన్న ఆ బాలుడు తల్లిదండ్రుల బాధ్యతల్లో భాగస్వామ్యం కావడం అందర్నీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఆ దృశ్యాన్ని 'ఆంధ్రజ్యోతి' క్లిక్ మనిపించింది.

-ఆంధ్రజ్యోతి/పాడేరు



ముమ్మరంగా ఉపాధి హామీ పనులు


చిన్నబంధవీధిలో ఉపాధి పనులు చేపడుతున్న గిరిజనులు

జి.మాడుగుల, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోఉపాధి హామీ పనులు జోరుగా సాగుతున్నాయి. ఖరీఫ్ పనులకు సమయం ఉండడంతో ప్రస్తుతం గిరిజనులు ఉపాధి పనుల వైపు మొగ్గు చూపుతున్నారు. పాలమామిడి పంచాయతీ పరిధిలోని పలు గ్రామాల్లో ఉపాధి హామీ పనుల్లో భాగంగా చెరువులు, భూమి చదును వంటి పనులు చేస్తున్నారు. చేసిన పనులకు వేతనాలు చెల్లించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు.

విజయవంతంగా మహా అన్నదానం


అన్నదాన కార్యక్రమంలో భోజనాలు వడ్డిస్తున్న బొర్రా నాగరాజు

పాడేరురూరల్, మే 13(ఆంధ్రజ్యోతి): మోదకొండమ్మ రాష్ట్ర గిరిజన మహోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ పాడేరు బ్రాంచ్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన మహా అన్నదాన కార్యక్రమం విజయవంతం అయ్యింది. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు బొర్రా నాగరాజు సహకారంతో నక్కలపుట్టు మామిడి తోటల్లో మంగళవారం మధ్యాహ్నం వెయ్యి మంది భక్తులు అన్నదానం స్వీకరించారని పాడేరు బ్రాంచ్ వైస్ చైర్మన్ గంగరాజు తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొర్రా విజయరాణి, ఐఆర్‌సీఎస్ సెక్రటరీ జి.గౌరీశంకరరావు, కోశాధికారి సూర్యారావు, సభ్యులు రవి, శ్రీను, సంజీవరావు, లైఫ్ మెంబర్ ఎస్.మణి, జిల్లా కో-ఆర్డినేటర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవకు దరఖాస్తు చేసుకోవాలి

గూడెంకొత్త వీధి, మే 13 (ఆంధ్రజ్యోతి):ఆదివాసీ రైతులు అన్నదాత సుఖీభవ పథకానికి దరఖాస్తు చేసుకోవాలని స్థానిక వ్యవసాయాధికారి మధుసుదనరావు తెలిపారు. మంగళవారం మండలంలోని దామనాపల్లి పంచాయతీ మాడెం గ్రామంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఖరీఫ్‌కు ముందే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలులోకి తీసుకొవచ్చేందుకు చర్యలు తీసుకుంటుందన్నారు. రైతులందరూ రైతు సేవా కేంద్రానికి ఆధార్, పట్టాదారు పాస్‌పుస్తకం తీసుకొని వెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కుందరి రామకృష్ణ, ఎంపీఈవో జోషఫ్ పాల్గొన్నారు.

కొత్త జీవో నిర్ణయం మంచి పరిణామం

పాడేరురూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): జీవో నంబర్ 3 స్థానంలో కొత్త జీవో తేవాలనే నిర్ణయం మంచి పరిణామమని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర ప్రెసిడెంట్ రేగం సూర్యనారాయణ, రాష్ట్ర జనరల్ సెక్రటరీ జి.శేషగిరిరావు అన్నారు. మంగళవారం వారు విలేకరులతో మాట్లాడుతూ మెగా డీఎస్సీ నుంచి ఏజెన్సీ పోస్టుల భర్తీకి మినహాయింపు ఇవ్వాలని కోరుతున్నామన్నారు. ఏజెన్సీలో స్థానిక గిరిజనులకు ప్రభుత్వ ఉద్యోగాల్లో 100 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కట్టుబడి ఉన్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటనను ఏపీ గిరిజన సంక్షేమ ఉపాధ్యాయ సంఘంగా ఆహ్వానిస్తున్నామన్నారు. ప్రభుత్వం తీసుకున్న మంచి నిర్ణయానికి ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రెసిడెంట్ కె.నీలకంఠం, జిల్లా గౌరవాధ్యక్షుడు కె.రామారావు, జిల్లా జనరల్ సెక్రటరీ ఎం.శోభన్ పాల్గొన్నారు.

పెదగరువు వంతెనపై ప్రమాదం

బ్రిడ్జి గోడను ఆటో ఢీకొని పలువురికి గాయాలు


వంతెనపై రక్షణ గోడను ఢీకొన్న ఆటో

హుకుంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ జాతర తిలకించుకుని సోమవారం తిరిగి వస్తున్న క్రమంలో పెదగరువు వంతెనపై రిటైనింగ్ వాల్‌ను ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఆటోలో ఉన్న కోట్నాపల్లి పంచాయతీ పరిధిలోని మత్స్యపురం గ్రామానికి చెందిన గెమ్మెలి సాయి, లత, కోర్రా సురేశ్ తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో డ్రైవర్ సురేశ్ పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులను వైద్య సేవల కోసం పాడేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

చీడిపుట్టు వంతెనపై కూరుకుపోయిన లారీ


వంతెన మధ్యలో కూరుకుపోయిన లారీ

హుకుంపేట, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చీడిపుట్టు వంతెన మధ్యలో భారీ లారీ మంగళవారం కూరుకుపోయింది. సిమెంట్ లోడుతో వస్తున్న 12 టైర్ల లారీ వంతెన మధ్యలో ఆగిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దీంతో మూడు పంచాయతీల ప్రజలు, ఉద్యోగులు, వాహన చోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడ్డారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణపై పలువురికి నోటీసులు

ఎలమంచిలి, మే 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జీఎన్‌టీ మెయిన్ రోడ్డును ఆనుకుని ఉన్న ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించిన వారికి నోటీసులు జారీ చేసినట్టు మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు తెలిపారు. మునిసిపల్ నిబంధనల మేరకు నోటీసులు జారీ చేశామన్నారు. ఇంటి రిజిస్టర్ దస్తావేజుల నకలు సమర్పించేందుకు నోటీసులు జారీ చేశామన్నారు. స్థలం హక్కు నిర్ధారించేందుకు భూ యాజమాన్య హక్కు పత్రాలను రెండు రోజుల్లో ఇవ్వాలని కోరామన్నారు. డాక్యుమెంట్లు పరిశీలించిన తరువాత తదుపరి చర్యలు తీసుకుంటామని ఆ నోటీసుల్లో పేర్కొన్నామని ఆయన చెప్పారు.

అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే చర్చ

- కొత్తూరు ఫ్లైఓవర్ బ్రిడ్జిపై పనులు ప్రారంభించండి
- తుమ్మపాల పంచాయతీ చినబాబు కాలనీ రోడ్డు నిర్మించండి
- ఆయా శాఖల అధికారులకు 'కొణతాల' ఆదేశం


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ

కొత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలంలోని మేజర్ పంచాయతీలైన కొత్తూరు, తుమ్మపాలలో అభివృద్ధి పనులను ప్రారంభించాలని ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ఆర్అండ్బీ శాఖ ఏఈ ప్రభుదాస్‌ను ఆదేశించారు. మంగళవారం జనసేన పార్టీ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తూరు పంచాయతీలో ఉన్న ఏఎంఏఎల్ కళాశాల వద్ద గల ఫ్లైఓవర్ బ్రిడ్జి, కొత్తూరు ప్రధాన రోడ్డు, తుమ్మపాల పంచాయతీలో ఉన్న చినబాబు కాలనీ రోడ్డు పనులను తక్షణమే ప్రారంభించి పూర్తి చేయాలన్నారు. రోడ్డు పనులు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం జీవీ ఎంసీ ఇంజనీరింగ్ అధికారులు, అమృత్ పథకం అధికారులు, కశింకోట తహసీల్దార్ సత్యనారాయణ తదితరులతో కలిసి నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు.

జూన్ 15న కూకట్‌పల్లిలో నూకాంబిక ఉత్సవం


ఉత్సవ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మళ్ల సురేంద్ర

అనకాపల్లి టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లోని కూకట్‌పల్లిలో జూన్ 15న నూకాంబిక ఉత్సవాన్ని నిర్వహించనున్నట్టు తెలంగాణ నూకాంబిక ఉత్సవ కమిటీ ప్రతినిధి కర్రి కిశోర్ కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించిన బ్రోచర్‌ను మంగళవారం ఇక్కడి గవరపాలెం పరమేశ్వరీ పార్కులో గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర చేతులమీదుగా ఆవిష్కరించి మాట్లాడారు. అనకాపల్లి పట్టణ వరల్డ్ వైడ్ గవర జేఏసీ ఆధ్వర్యంలో ఈ వేడుక జరగనుందన్నారు. అనంతరం సురేంద్ర మాట్లాడుతూ నూకాంబిక అమ్మవారి కొత్త అమావాస్య జాతరను రాష్ట్ర పండుగగా ఎంతో ఘనంగా నిర్వహించారన్నారు. తెలంగాణలో కూడా అన్ని వర్గాల వారిని కలుపుకొని పండుగను వైభవోపేతంగా జరపాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పోలారపు త్రినాథ్, మళ్ల సూరిబాబు, దాడి జగన్ తదితరులు పాల్గొన్నారు.

డీపీటీవో కార్యాలయాన్ని ముట్టడించిన కార్మికులు


డీపీటీవో కార్యాలయం ముందు నిరసన తెలియజేస్తున్న కార్మికులు

అనకాపల్లి టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : సమస్యల పరిష్కారానికి గత కొద్ది రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేపడుతున్న కార్మికులు మంగళవారం మధ్యాహ్నం ఆర్టీసీ ఎన్ఎంయూఏ ఆధ్వర్యంలో డీపీటీవో కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా జోనల్ అధ్యక్షులు వి.ప్రదీప్‌కుమార్ మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగుల న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 1/2019 సర్క్యులర్‌ను తక్షణమే అమలు చేయాలని, రాష్ట్రస్థాయిలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని, అక్రమంగా బదిలీ చేసిన కండక్టర్ ఎస్ఎస్ నారాయణకు అనకాపల్లి డిపోలోనే పోస్టింగ్ ఇవ్వాలని కోరారు. ఎన్ఎంయూఏ రీజనల్ కార్యదర్శి పి.సుధాకర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జోనల్ చైర్మన్ ఎం. సూర్యం, వైస్ ప్రెసిడెంట్ బీఎస్ రంగా, జి.శంకరరావు, ఆర్వీ రమణతో పాటు అనకాపల్లి, నర్సీపట్నం డిపోల యూనియన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రభుత్వం దృష్టికి సీహెచ్‌వోల సమస్యలు


సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్నకమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

అనకాపల్లి టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు చేపట్టిన సమ్మె మంగళవారం పదహారవ రోజుకు చేరుకుంది. ఇందులో భాగంగా నెహ్రూ చౌక్ వద్ద గల సమ్మె శిబిరంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, రాష్ట్ర మంత్రులు నారా లోకేశ్, సత్యప్రసాద్‌లకు సోషల్ మీడియా వేదిక ద్వారా తమ విన్నపాన్ని తెలియజేశారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయాల్సిందిగా కోరారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కోశాధికారి వీవీ శ్రీనివాసరావు, సీహెచ్‌వోలు భవానీ, నూకాలమ్మ, సంధ్య, లక్ష్మి, రేవతి, యమున తదితరులు పాల్గొన్నారు.

గాలి వీచినా.. వాన కురిసినా.. వణుకే!

- సినిమాహాల్ జంక్షన్ సమీపంలో కూలేందుకు సిద్ధంగా విద్యుత్ స్తంభం



ప్రమాదకరంగా మారిన స్తంభం (ఇన్ సెట్) అడుగు భాగంలో కనిపిస్తున్న ఇనుప ఊచలు

పరవాడ, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం పరవాడ సినిమాహాల్ జంక్షన్ సమీపంలో ప్రధాన రహదారికి ఆను కొని ఉన్న విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. అడుగుభాగం శిథిలమై ఇనుప చువ్వలు బయటకు కనిపిస్తుండడంతో ఎప్పుడు కూలిపోతుందోనని స్థానికులు భయాందోళన చెందుతున్నారు. గాలులు వీచినప్పుడు, భారీ వర్షాలు కురిసే సమయాల్లో అటుగా రాకపోకలు సాగించేవారు హడలిపోతున్నారు. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నా పటించుకునేవారు కరువయ్యారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి, పాత స్తంభాన్ని తొలగించి కొత్తది ఏర్పాటు చేయాలని అంతా కోరుతున్నారు.

చినుకు పడితే..చెరువే

- అధ్వానంగా రేఖవానిపాలెం- నునపర్తి రహదారి
- రాకపోకలకు జనానికి ఇబ్బందులు


చిన్నపాటి వర్షానికే గుంతల్లో నీరు చేరి అధ్వానంగా మారిన రహదారి



పరవాడ, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బొట్టవానిపాలెం జంక్షన్ నుంచి రేఖవానిపాలెం, గొల్లగరువు మీదుగా నునపర్తికి వెళ్లే ప్రధాన రహదారి అధ్వానంగా మారింది. రహదారి పొడవునా పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. కొద్దిపాటి వర్షం కురిసినా ఆయా గుంతల్లో నీరు చేరి రోజుల తరబడి నిల్వ ఉండిపోతుంది. దీంతో అటుగా రాకపోకలు సాగించే వారంతా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సోమవారం రాత్రి కురిసిన చిన్నపాటి వర్షానికి గుంతల్లో నీరు చేరింది. ఏళ్ల తరబడి ఈ రహదారి నిర్వహణను పట్టించుకోక పోవడంతో నేడు ఈ దుస్థితికి చేరింది. ముఖ్యంగా గొల్లగరువు వద్ద పరిస్థితి మరింత జటిలమైంది. రహదారికి ఆనుకొని ఉన్న గెడ్డవాగు పూడ్చి వేయడంతో వర్షం వస్తే నీరంతా రహదారిపైనే నిలిచిపోతుంది. పలు చోట్ల రహదారిపై రాళ్లుతేలి నడవడానికి వీల్లేకుండా తయారైంది. ఆర్అండ్బీ అధికారులు స్పందించి మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

క్షేత్రస్థాయిలో టీడీపీ మరింత బలోపేతం

- గ్రామ కమిటీ ఎన్నిక నిర్వహణలో 'పీలా'


అధ్యక్షుడిగా ఎన్నికైన ప్రసాద్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పీలా గోవింద


ఎన్నికైన తుమ్మపాల గ్రామ కమిటీ సభ్యులతో టీడీపీ నాయకులు

కశింకోట, మే 13 (ఆంధ్రజ్యోతి) : క్షేత్రస్థాయిలో పార్టీ మరింత బలోపేతంతో పాటు సంక్షేమ ఫలాలు అర్హులందరికీ అందేలా కృషి చేయాల్సిన బాధ్యత టీడీపీ శ్రేణులపై ఉందని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. మండలంలోని కన్నూరుపాలెం గ్రామ టీడీపీ కమిటీ ఎన్నికను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్టీకి కార్యకర్తలే వెన్నెముకగా పేర్కొన్నారు. అనంతరం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా చుక్క ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా కూండ్రపు కన్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి కూండ్రపు పైడిరాజు, కార్యనిర్వాహక కార్యదర్శులుగా నెమ్మది రమేష్, కర్రి నానాజీ, ఎద్దు కృష్ణ ఎన్నికయ్యారు. కోశాధికారిగా మర్రా రాజు, కార్యదర్శి చుక్క కన్నంనాయుడు, కొమ్మొజు శ్రీను, రెడ్డి దేముళ్ళు, సోషల్ మీడియా కన్వీనర్‌గా చీపురుపల్లి నాయుడులను ఎన్నుకున్నారు. తెలుగు మహిళా అధ్యక్షురాలుగా కన్నూరు అక్కియ్యమ్మ, ప్రధాన కార్య దర్శిగా జాగారపు ఈశ్వరమ్మ, తెలుగు యువత అధ్యక్షుడిగా పైల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా వర్రీ శ్రీను ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గ సభ్యులతో పీలా ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తుమ్మపాల : టీడీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆ పార్టీ పట్టణ అధ్యక్షుడు డాక్టర్ కేకేవీఏ నారాయణరావు పిలుపునిచ్చారు. తుమ్మపాలలో జరిగిన కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తొలుత గ్రామ టీడీపీ కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా కొణతాల వెంకటరమణ, ప్రధాన కార్యదర్శిగా నడిపల్లి కన్నయ్యనాయుడుతో పాటు మరికొందరిని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ పచ్చికూర రాము, నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, కర్రి బాబి, రాపేటి రామ్‌కుమార్, సందిన సునీల్, సందిన చినబాబు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీలకు పెన్షన్ విధుల నుంచి తప్పించకుంటే ఆందోళన

- సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి నాగశేషు

అనకాపల్లి టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : అంగన్‌వాడీ వర్కర్లను పెన్షన్ విధుల నుంచి మినహాయించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.నాగశేషు డిమాండ్ చేశారు. ఇక్కడి దొడ్డి రామునాయుడు భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. అంగన్‌వాడీ వర్కర్లకు రకరకాల యాప్‌లతో ఆన్‌లైన్ పనిభారం పెరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన కొత్తలో గ్రామాల్లో పెన్షన్ పంపిణీలో సచివాలయ సిబ్బందికి రెండుమూడు నెలలు సహకరించాలని అధికారులు సూచించారన్నారు. దీంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా పింఛన్ పంపిణీ చేశారన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇప్పటికే పనిభారం పెరిగిందని వివరించారు. ఒకటవ తేదీ నుంచి పిల్లల బరువు తీయడం, టీహెచ్ఆర్ పంపిణీ చేయడం, పిల్లలకు పోషకాహారం వండి పెట్టడం, ప్రీ స్కూల్ నిర్వహించడం, యాప్‌లు అప్‌లోడ్ చేయడం ఇలా అనేక పనులతో సతమతమవుతున్న పరిస్థితుల్లో పెన్షన్ల పంపిణీ చేయడం మరింత భారంగా మారిందని పేర్కొన్నారు. పెన్షన్ల పంపిణీ నుంచి అంగన్‌వాడీలకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. లేని పక్షంలో ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షురాలు ఎం.దుర్గారాణి, సీహెచ్.రామలక్ష్మి, ఎ.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రామ దేవతల అనుపోత్సవం


సబ్బవరంలో దుర్గమాంబను దర్శించుకుంటున్న బాబ్జీ

సబ్బవరం, మే 13 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రం సబ్బవరం శివారు పెదనాయుడుపాలెంలో మర్లమ్మతల్లి, రాయపుర అగ్రహారంలో పరదేశమ్మ అమ్మవార్ల అనుపోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేకువజాము నుంచి విశేష పూజలు ప్రారంభమయ్యాయి. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. సాయంత్రం మేళతాళాలు, తప్పెట గుళ్ల, కోలాటం, సాముగరడీ, బాణసంచా కాల్పుల నడుమ అమ్మవార్లను ఊరేగించిన అనంతరం ఆలయం వద్ద అనుపోత్సవాన్ని జరిపారు. పెదనాయుడుపాలెం మర్లమ్మతల్లిని ఆంధ్రప్రదేశ్ ఆయిల్ ఫెడ్ కార్పొరేషన్ చైర్మన్ గండి బాబ్జీతో పాటు సర్పంచ్ దెడ్డం ప్రసాదరావు, ఉప సర్పంచ్ మండల లక్ష్మణ, ఎంపీటీసీలు, ఉత్సవ కమిటీ సభ్యులు దర్శించుకున్నారు.

నేటి నుంచి మరిడిమాంబ జాతర



లంకెలపాలెం : మరిడిమాంబ జాతరను లంకెలపాలెంలో బుధవారం నుంచి రెండు రోజుల పాటు నిర్వహించనున్నారు. ఇందుకు సంబంధించి కమిటీ సభ్యులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. తొలిరోజు రాత్రి ఘటాల ఊరేగింపుతో పాటు తొలేళ్ల ఉత్స వం జరగనుంది. గురువారం తెల్లవారుజాము నుంచి అమ్మవారికి విశేష అలంకరణలు చేపట్టి పూజల అనంతరం భక్తులకు దర్శనభాగ్యం కల్పించనున్నామని కమిటీ ప్రతినిధులు తెలిపారు.

సీఎం సహాయ నిధి చెక్కులు అందజేత

కశింకోట, మే 13 (ఆంధ్రజ్యోతి) : పేదలను ఆదుకునేందుకే ముఖ్యమంత్రి సహాయ నిధిని ప్రవేశపెట్టారని అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ అన్నారు. కన్నూరుపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న అక్కిరపు వెంకటరమణ కుటుంబ సభ్యులకు మంగళవారం సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన ఐదు లక్షల రూపాయల చెక్కును అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గుల్లేపల్లిలో...

సబ్బవరం : మండలంలోని గుల్లేపల్లి గ్రామానికి చెందిన దేవర దుర్గాదేవి కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. చికిత్సలకు అయ్యే ఖర్చును పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరు చేయించారు. ఈ మేరకు సదరు కుటుంబానికి కూటమి నాయకులు రోమాల చంద్రశేఖర్, కర్రి కనకరాజు, మాజీ సర్పంచ్ గజ్జి నర్సింగరావులు మంగళవారం రూ.1,31,354ల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో బోకం నారాయణమూర్తి, నంబారు రాజబాబు, గొంప ఆనంద్, పల్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరు యువకులపై పోక్సో కేసు

కొత్తూరు, మే 13 (ఆంధ్రజ్యోతి) : అనకాపల్లి మండలానికి చెందిన ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేసినట్టు రూరల్ ఎస్ఐ జి.రవికుమార్ మంగళవారం తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన కథనం ప్రకారం వివరాలివి. కూండ్రం గ్రామానికి చెందిన పద్నాలుగేళ్ల బాలికపై తగరంపూడి గ్రామానికి చెందిన ఇద్దరు యువకులు అత్యాచారయత్నానికి పాల్పడ్డారన్నారు. ఈ ఘటనపై అందిన సమాచారం మేరకు ఆ ఇద్దరు యువకులపై పోక్సో కేసు నమోదు చేశామని ఎస్ఐ చెప్పారు.

ప్రశాంతంగా ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

అనకాపల్లి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలు మంగళవారం ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం జనరల్ కోర్సు ఇంగ్లీషు-1, ఒకేషనల్ కోర్సు ఇంగ్లీషు-1 పరీక్షలకు మొత్తం 5,245 మంది హాజరుకావాల్సి ఉండగా, 5044 మంది పరీక్షలు రాశారని జిల్లా ఒకేషనల్ ఎడ్యుకేషన్ ఆఫీసర్ సుజాత తెలిపారు. అలాగే మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం జనరల్ కోర్సు ఇంగ్లీషు-2, ఒకేషనల్ కోర్సు ఇంగ్లీషు-2 పరీక్షలకు 747 మంది హాజరుకావాల్సి ఉండగా 675 మంది వచ్చేశారన్నారు. ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోలేదన్నారు.

'గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టాలి'

అనకాపల్లి టౌన్, మే 13 (ఆంధ్రజ్యోతి) : దెబ్బతిన్న గ్రోయిన్లకు మరమ్మతులు చేపట్టాలని అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షులు విల్లూరి పైడారావు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. వేసవిలో చేపట్టాల్సిన గ్రోయిన్ పనులను ఇరిగేషన్ అధికారులు ఇప్ప టికీ ప్రారంభించలేదని, దీనివలన రైతులు చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుందని వివరించారు. నియోజకవర్గంలో సుమారు ఆరువేల ఎకరాలు గ్రోయిన్లపై ఆధారపడి ఉన్నాయని, వెంటనే జంగిల్ క్లియరెన్స్ చేపట్టి యల్లయ్య, చెర్లోపలి, నాగులాపల్లి, ఇతర గ్రోయిన్ పనులను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలని ఎంపీ, ఎమ్మెల్యేలకు ఆయన విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయంలో వ్యాసరచన పోటీలు

కశింకోట, మే 13 (ఆంధ్రజ్యోతి) : మేజర్ పంచాయతీ తాళ్లపాలెం శాఖా గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా విద్యార్థులకు మంగళవారం వ్యాసరచన పోటీలు నిర్వహించారు. గ్రంథాలయాధికారి జగన్ మాట్లాడుతూ విద్యార్థులకు ప్రతి రోజూ చదివించడంతో పాటు కథలు వివరిస్తున్నట్టు చెప్పారు. అంతే కాకుండా గ్రంథాలయాల సందర్శన వల్ల ప్రయోజనాలను తెలియజేస్తున్నామన్నారు. విద్యార్థులంతా గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

టీడీపీ సీనియర్ నాయకుడు సన్యాసినాయుడుకు నివాళి

కశింకోట, మే 13(ఆంధ్రజ్యోతి) : బయ్యవరం టీడీపీ సీనియర్ నాయకుడు కలగ సన్యాసినాయుడు మృతి చెందడంతో ఆయన భౌతిక కాయంపై మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద మంగళవారం పార్టీ జెండాకప్పి సంతాపాన్ని తెలియజేశారు. గ్రామంలో జరిగిన అంత్యక్రియల్లో ఆయనతో పాటు నాయకులు కాయల మురళీ, వేగి గోపీ, సిదిరెడ్డి శ్రీను, ఎస్‌కే రెహ్మాన్, పెద్దిరెడ్డి ప్రసాద్, సీరం వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిలో ఆపరేషన్ థండర్

» ఆక్టోపస్ పోలీసుల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్



మాక్‌డ్రిల్‌లో భాగంగా బందీలను రక్షించేందుకు వెళుతున్న ఆక్టోపస్ పోలీసులు

పరవాడ, మే 13 (ఆంధ్రజ్యోతి): సింహాద్రి ఎన్టీపీసీలో రాష్ట్ర పోలీస్ కమాండో విభాగమైన ఆక్టోపస్ ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి ఆపరేషన్ థండర్ పేరుతో సమగ్ర మాక్‌డ్రిల్ నిర్వహించారు. డ్రిల్ ప్రణాళిక ప్రకారం.. ఆరుగురు ఉగ్రవాదులు ఆయుధాలతో సింహాద్రి ప్రాజెక్టులో చొరబడతారు. అక్కడున్న కొందరిపై కాల్పులు జరిపి అనంతరం లోపలికి ప్రవేశిస్తారు. ఈ సమాచారం అందుకున్న ఆక్టోపస్ బృందం తక్షణమే స్పందించింది. వ్యూహాత్మకంగా ఆపరేషన్ ప్రారంభించి ఉగ్రవాదులను పట్టుకుని, వారి చేతిలో బందిగా ఉన్న పలువురిని సురక్షితంగా రక్షిస్తుంది. అంతకుముందు జిల్లా ఎస్పీ తుహిన్‌సిన్హా ఆదేశాల మేరకు వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సింహాద్రి ఎన్టీపీసీ ఈడీ సమీర్‌శర్మ, సీఐఎస్ఎఫ్ డిప్యూటీ కమాండెంట్ రాజ్‌కుమార్, ఆక్టోపస్ అదనపు పోలీస్ అధికారి రాజారెడ్డి, పరవాడ డీఎస్పీ వి.విష్ణుస్వరూప్, సీఐ ఆర్.మల్లికార్జునరావు, సీఐఎస్ఎఫ్ అధికారులు, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, రెవెన్యూ, సేఫ్టీ విభాగాల అధికారులు, ఏఆర్ విభాగానికి చెందిన బాంబు డిస్పోజబుల్ టీమ్, డాగ్‌స్క్వాడ్, ఇతర పోలీస్ బలగాలు పాల్గొన్నాయి.

పౌరసరఫరాల శాఖకు దరఖాస్తుల వెల్లువ

» కొత్త పేర్లు చేర్చడానికి అత్యధికంగా అప్లికేషన్లు

అనకాపల్లి రూరల్, మే 13 (ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, తొలగింపులు, కొత్త రేషన్ కార్డుల కోసం ఇబ్బడిముబ్బడిగా దరఖాస్తులు వస్తున్నాయి. నూతన రేషన్ కార్డుల మంజూరుతోపాటు కార్డుల్లో కొత్తగా పేర్లు చేర్చడం, చనిపోయిన వారి పేర్లు తొలగించడం, పేర్లలో తప్పులు సవరించడం వంటి వాటికోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ నెల 7వ తేదీన ప్రకటించారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు (13వ తేదీ సాయంత్రం) జిల్లా పౌర సరఫరా శాఖకు 3,332 దరఖాస్తులు అందాయి. అంతకుముందు జిల్లా ఏర్పడినప్పటి నుంచి ఈ నెల 7వ తేదీ వరకు చేసుకున్న దరఖాస్తులు మరో 4,781 వున్నాయి. మొత్తం మీద మంగళవారంనాటికి పౌరసరఫరాల శాఖ వద్ద 8,113 దరఖాస్తుదారులు పెండింగ్‌లో వున్నాయి.

గత వైసీపీ ప్రభుత్వం కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయకపోవడంతో రేషన్‌తోపాటు పలు సంక్షేమ పథకాలు అందక ఎంతో మంది తీవ్ర ఇబ్బందులు పడ్డారు. బియ్యం కార్డులకు అర్హత వున్న వారికి సైతం కొత్త కార్డులు ఇవ్వలేదు. గత ఏడాది కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నుంచి కొత్త రేషన్‌కార్డులు ఎప్పుడు మంజూరు అవుతాయా.. అని వేలాది మంది ఎదురుచూడడం ప్రారంభించారు. ఎట్టకేలకు రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల తీపి కబురు చెప్పింది. నూతన రేషన్ కార్డుల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని ప్రకటించడంతో గ్రామ/ వార్డు సచివాలయాల ద్వారా పౌరసరఫరాల శాఖకు దరఖాస్తులు ఇబ్బడిముబ్బడిగా వస్తున్నాయి. ఈ నెల 7వ తేదీ నుంచి మంగళవారం వరకు పౌరసరఫరాల శాఖలో ఏడు రకాల సేవలకు సంబంధించి 3,332 మంది దరఖాస్తు చేసుకున్నారు. కార్డుల్లో కొత్త సభ్యుల పేర్లు చేర్చడానికి 2,564 మంది, కొత్త కార్డుల కోసం 303 మంది, చిరునామా మార్పు కోసం పది మంది, ఆధార్ సీడింగ్ కోసం 72 మంది, చనిపోయిన వారి పేర్ల తొలగింపు కోసం 70 మంది, తప్పుగా నమోదైన పేర్లను సరిచేయడానికి 311 మంది, రేషన్ కార్డులు సరెండర్ చేయడానికి రెండు దరఖాస్తులు అందాయి. అయితే అంతకుముందు అనకాపల్లి జిల్లా ఏర్పడిననాటి నుంచి ఈ నెల 7వ తేదీ వరకు ఆయా సేవల కోసం 4,781 దరఖాస్తులు అందాయి. వీటితో కలుపుకుని మొత్తం 8,113 దరఖాస్తుదారులు పౌర సరఫరాల శాఖకు చేరాయి.

ప్రజా సమస్యలపై చిత్తశుద్ధితో పనిచేయాలి

... 5వ పేజీ తరువాయి

శెట్టి రోషిణి మాట్లాడుతూ, గిరిజన గ్రామాల్లో దోమల నివారణకు పొగ (ఫాగింగ్) కొట్టకపోవడంతో మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ వంటి జ్వరాలు ప్రబలుతున్నాయని, 108 వాహనాలు సైతం సకాలంలో స్పందించడం లేదని, గిరిజన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ సమస్యలపై సత్వర చర్యలు తీసుకోవాలని అధికారులను చైర్‌పర్సన్ ఆదేశించారు. జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ కొళాయిపై దృష్టి సారించి త్వరితగతిన పూర్తిచేయాలని, పెండింగ్ కనెక్షన్లు, ఇతర సమస్యలపై మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి లేవనెత్తిన ప్రశ్నలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని సుభద్ర సూచించారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చేపడుతున్న పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఆమె ఆదేశించారు.

పంచాయతీల్లో ఇంకుడు గుంతలు

గ్రామాల్లో మురుగునీటి సమస్య పరిష్కారానికి మురుగుకాలువల చివరన ఇంకుడు గుంతల తవ్వకం పనులను ఉపాధి హామీ పథకం నిధులతో చేపడతామని అనకాపల్లి డ్వామా పీడీ ఆర్.పూర్ణిమాదేవి వెల్లడించారు. ప్రతి గ్రామ పంచాయతీలో మూడు ఇంకుడు గుంతలు తవ్వడానికి ప్రభుత్వం అనుమతించిందన్నారు. ఒక్కొక్క ఇంకుడు గుంతకు రూ.74 వేల చొప్పున కేటాయిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో సీఈవో పి.నారాయణ మూర్తి, డిప్యూటీ సీఈవో కె.రాజ్‌కుమార్, జడ్పీటీసీ సభ్యులు, ఉమ్మడి జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

బెండ రైతు దిగాలు

.. 5వ పేజీ తరువాయి

పక్కనే వున్న కె.కోటపాడు, చీడికాడ, విజయనగరం జిల్లా వేపాడ మండలాల్లో ఎక్కువ మంది రైతులు బెండ సాగు చేపట్టారు. దీంతో స్థానిక మార్కెట్లు, సంతలకు పెద్ద మొత్తంలో బెండకాయలు తీసుకు వస్తున్నారు. దీంతో డిమాండ్‌ను మించి సరకు రావడంతో ధర తగ్గిపోతున్నది. దేవరా పల్లిలో సోమవారం మార్కెట్ లేకపోవడంతో మంగళవారం పలువురు రైతులు పెద్ద మొత్తంలో బెండకాయలు తీసుకువచ్చారు. మార్కెట్‌లో ఎక్కడ చూసినా బెండకాయల క్రేట్లు కనిపిస్తుండడంతో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన చిరువ్యాపారుల, దళారులు రేటు తగ్గించి అడగడం మొదలుపెట్టారు. తొలుత 12 కిలోల క్రేట్ కాయలు రూ.30 వరకు ధర పలికింది. తరువాత కొనుగోలుదారులు తగ్గిపోవడంతో రైతులు రేటు తగ్గించాల్సి వచ్చింది. చివరకు క్రేట్ బెండకాయలు రూ.20కి ఇస్తామన్నా.. కొనేవారు లేకపోయారు. దీంతో తీవ్రమనస్తాపం చెందిన పలువురు రైతులు.. బెండకాయలను రోడ్డుపై పారబోసి, ఖాళీ క్రేట్‌లతో ఇంటిముఖం పట్టారు. ఇక ఆనపకాయ, బరబాటీల ధరలు కూడా బాగాతగ్గిపోయాయి.



బయ్యవరంలో శారదావనం

ఆకట్టుకుంటున్న శారదా వనం

» బయ్యవరం రిజర్వు ఫారెస్టు భూమిలో రూ.2 కోట్లతో ఏర్పాటు

» వాకింగ్ పాత్, పగోడాలు, వాచింగ్ టవర్లు, చిన్నారులకు ఆటల పరికరాలు



చెక్కలతో నిర్మించిన గెస్ట్ హౌస్

కశింకోట, మే 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బయ్యవరంలో ఉన్న రిజర్వు ఫారెస్టు భూమిలో శారదా వనం నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయి. పర్యాటకులను ఆకట్టుకు నేలా అటవీ శాఖ అధికారులు అభివృద్ధి చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిన రూ.2 కోట్ల నిధులతో వివిధ నిర్మాణాలు చేపట్టారు. అటవీ శాఖకు చెందిన 25 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న శారదా వనంలో వాకింగ్ పాత్, పగోడాలు, వాచింగ్ టవర్లు, చిల్డ్రన్స్ పార్కు, ఎడ్యుకేషనల్ సెంటర్, కేఫ్టేరియా అందుబాటులోకి వస్తాయి. బొటానికల్ గార్డెన్‌లో రోజ్‌వుడ్, టేకు, ఎర్రచందనం వంటి మొక్కలను నాటారు. చిన్నారులు ఆడుకోవడానికి జారుడుబల్లలు, ఉయ్యా లలు ఏర్పాటు చేస్తున్నారు. ఇక్కడకు వచ్చే వారు అటవీ ప్రాంతంలో వున్నామన్న అనుభూతి కలిగేలా శారదా వనాన్ని తీర్చిదిద్దుతున్నారు. కాగా ఉపాధి హామీ పథకం కింద రెండు నర్సరీలు ఏర్పాటు చేస్తున్నారు.



సందర్శకులు కూర్చునేందుకు నిర్మించిన పగోడా



చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన ఆటల పరికరాలు

మోదకొండమ్మకు భక్త నీరాజనం

» వైభవంగా ముగిసిన ఉత్సవాలు

» ఘటాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్న భక్తులు

» అనుపోత్సవానికి పోటెత్తిన జనం

పాడేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): పాడేరు మోదకొండమ్మ మూడు రోజుల ఉత్సవాలు మంగళవారం నిర్వహించిన అనుపోత్సవంతో ముగిశాయి. తొలి రోజు ఉత్సవం విగ్రహం, పాదాలును ఆలయం నుంచి ఊరేగింపుగా తీసుకువచ్చి సతకంపట్టు వద్ద కొలువు తీర్చడంతో మొదలైన ఉత్సవాలు.. ఆఖరి రోజు సతకంపట్టు నుంచి ఉత్సవ విగ్రహాన్ని, పాదాలును తిరిగి ఆలయంలో చేర్చడంతో ముగిశాయి. ఇన్‌చార్జి కలెక్టర్, జేసీ డాక్టర్ ఎంజే అభిషేక్‌గౌడ, ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి, తదితరులు పాదాలు, ఉత్సవ విగ్రహం, అమ్మవారి ఘటాలను తలకెత్తుకుని అనుపోత్సవాన్ని ప్రారంభించారు. సతకంపట్టు నుంచి అమ్మవారి ఆలయం వరకు నిర్వహించిన ఊరేగింపులో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనుపోత్సవం ఊరేగింపులో పలు రకాల నేల వేషాలు, డప్పుల మోతలు, కేరళ ఓనం బ్యాండ్, తీన్‌మార్ బ్యాండ్ వంటివి ఏర్పాటు చేశారు. ఉత్సవాలు ఆఖరి రోజు కావడంతో అధిక సంఖ్యలో జనం ఊరేగింపులో పాల్గొన్నారు. మంగళవారం ఉదయం నుంచి అమ్మవారికి అధిక సంఖ్యలో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. డప్పుల మోతలతో వచ్చి అమ్మవారికి ఘటాలు సమర్పించడం ఆనవాయితీ. దీంతో భక్తులు కుటుంబాలతో ఘటాలు తీసుకువచ్చి మోదకొండమ్మకు సమర్పించారు. మొక్కుబడిలో భాగంగా పలువురు భక్తులు తలనీలాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో పోలవరం ప్రాజెక్టు అడ్మినిస్ట్రేటర్ వి.అభిషేక్, సబ్‌కలెక్టర్ శౌర్యమన్‌పటేల్, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కె.కోటినాయుడు, ఉత్సవ కమిటీ ప్రతినిధులు సల్లా రామకృష్ణ, టి.ప్రసాదరావునాయుడు, కె.సురేశ్‌కుమార్, కెజియారాణి, కె.ప్రశాంత్, కె.సతీశ్, కె.వెంకటరమణ, ఉత్సవ, ఆలయ కమిటీ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.



మోదకొండమ్మకు పట్టు వస్త్రాలు సమర్పిస్తున్న మంత్రి గుమ్మడి సంధ్యారాణి, చిత్రంలో ఎస్పీ అమిత్‌బర్దార్, జీసీసీ చైర్మన్ కిడారి, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి



అనుపోత్సవంలో పాల్గొన్న భక్తజనం

పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి సంధ్యారాణి

గిరిజనులు సుభిక్షంగా ఉండాలని మోదకొండమ్మ అమ్మవారిని మొక్కుకున్నానని రాష్ట్ర గిరిజన, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి గుమ్మడి సంధ్యారాణి అన్నారు. మోదకొండమ్మ ఉత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం ఆమె మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. గర్భాలయంలో మోదకొండమ్మకు మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకు ముందు సతకంపట్టులో కొలువు తీరిన మోదకొండమ్మను దర్శించుకున్నారు. ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ ప్రభుత్వ శాఖల స్టాల్స్‌ను సందర్శించారు. గిరిజన మహిళలతో థింసా నృత్యం చేశారు.

19న డిప్యూటీ మేయర్ ఎన్నిక

» పదవి కోసం ఆశావహులు ముమ్మర ప్రయత్నాలు

» ఎంపికలో సామాజికవర్గాల సమీకరణలే కీలకం

» యాదవ, కాపు సామాజికవర్గాల మధ్యే పోటీ

» ఎవరికివారు ముమ్మర ప్రయత్నాలు

» చంద్రబాబు వద్దకు చేరిన పంచాయితీ

» నేడు సీఎంను కలవనున్న మేయర్, ఎమ్మెల్యేలు



(విశాఖపట్నం-ఆంధ్రజ్యోతి)

మహా విశాఖ నగర పాలక సంస్థ (జీవీఎంసీ) డిప్యూటీ మేయర్ పదవి కోసం కూటమి కార్పొరేటర్లలో పలువురు పోటీపడుతున్నారు. తమకు సన్నిహితంగా ఉండే ప్రజాప్రతినిధులు, నాయకుల ద్వారా ప్రయత్నాలు కొనసాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో డిప్యూటీ మేయర్ ఎంపికను సీఎం చంద్రబాబునాయుడుకు విడిచిపెట్టేయాలని మేయర్‌తోపాటు ప్రజా ప్రతినిధులు నిర్ణయించారు. ఈ విషయమై అమరావతిలో బుధవారం సీఎంతో జరిగే సమావేశం కోసం మేయర్‌తోపాటు ఎమ్మెల్యేలంతా మంగళవారం రాత్రి బయలుదేరి వెళ్లారు.

జీవీఎంసీ మేయర్ గొలగాని హరి వెంకటకుమారితోపాటు డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్‌పై కూటమి కార్పొరేటర్లు అవిశ్వాస తీర్మానం పెట్టడంతో ఇద్దరూ పదవి కోల్పోయారు. కొత్త మేయర్‌గా టీడీపీకి చెందిన 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు ఎన్నికవ్వగా, డిప్యూటీ మేయర్ ఎన్నిక ఈ నెల 19న జరగాల్సి ఉంది. డిప్యూటీ మేయర్ పదవి కోసం పలువురు కార్పొరేటర్లు పోటీ పడుతున్నారు. మేయర్ పదవి నుంచి తప్పించిన గొలగాని హరి వెంకటకుమారి యాదవ సామాజిక వర్గానికి చెందినవారు అయినందున... డిప్యూటీ మేయర్ పదవిని తమకు కేటాయించాలని ఆ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు డిమాండ్ చేస్తున్నారు. లేనిపక్షంలో సామాజిక వర్గం నుంచి ఒత్తిడిని ఎదుర్కోనాల్సి వస్తుందని ప్రజాప్రతినిధుల ముందు వాదన వినిపిస్తున్నారు. డిప్యూటీ మేయర్ పదవి కోసం ఈ సామాజిక వర్గం నుంచి ఐదో వార్డు కార్పొరేటర్ మొల్లి హేమలత, 18వ వార్డు కార్పొరేటర్ గొలగాని మంగవేణితోపాటు 90వ వార్డు కార్పొరేటర్ బొమ్మిడి రమణ పోటీ పడుతున్నారు. వైసీపీ నుంచి కార్పొరేటర్‌గా గెలిచి, స్టాండింగ్ కమిటీ సభ్యుడిగా ఉంటూనే సాధారణ ఎన్నికలకు ముందు టీడీపీలో చేరిన 29వ వార్డు కార్పొరేటర్ ఉరుకూటి నారాయణరావు కూడా ఈ పదవిని తనకు ఇవ్వాలని పట్టుబడుతున్నారు.

ఇదిలావుండగా కాపు సామాజిక వర్గానికి చెందిన జియ్యాని శ్రీధర్‌ను పదవి నుంచి తొలగించినందున అదే వర్గానికి చెందిన వారికి కేటాయించడం ద్వారా సామాజిక సమతుల్యాన్ని పాటించాలని ఆ సామాజిక వర్గానికి చెందిన కార్పొరేటర్లు పట్టుబడుతున్నారు. ప్రధానంగా 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావు, 97వ వార్డు కార్పొరేటర్ సేనాపతి వసంత, 94వ వార్డు కార్పొరేటర్ బల్ల శ్రీనివాసరావులు డిప్యూటీ మేయర్ పదవి కోసం తమవంతు ప్రయత్నాలను ముమ్మరంగా సాగిస్తున్నారు. పార్టీలో సీనియారిటీని, జీవీఎంసీలో గత నాలుగేళ్ల వైసీపీ పాలనపై కౌన్సిల్‌లో పోరాటం చేయడం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుంటే గంధం శ్రీనివాసరావుకు అవకాశం దక్కడం ఖాయమని పార్టీ నేతలు చెబుతున్నారు. కానీ యాదవ సామాజిక వర్గ మహిళను మేయర్ పదవి నుంచి దించినందున తిరిగి అదే సామాజిక వర్గం నుంచి మహిళను మేయర్ పదవికి ఎంపిక చేయాల్సి ఉన్నప్పటికీ ప్రత్యేక పరిస్థితులు, పార్టీ పట్ల విధేయతను చూపడాన్ని దృష్టిలో పెట్టుకుని గవర సామాజిక వర్గానికి చెందిన పీలా శ్రీనివాసరావుకు అవకాశం ఇచ్చినందున... కనీసం డిప్యూటీ మేయర్ పదవిని యాదవ వర్గానికి చెందిన మహిళకు కేటాయిస్తే బాగుంటుందని కొందరు ప్రజాప్రతినిధులు అభిప్రాయపడుతున్నారు.

మరోవైపు డిప్యూటీ మేయర్ పదవిని తమకు కేటాయించాలని జనసేన ఫ్లోర్ లీడర్ బీశెట్టి వసంతలక్ష్మి పట్టుబడుతున్నప్పటికీ ఆమె సామాజిక వర్గానికే చెందిన వ్యక్తి పీలా శ్రీనివాసరావు మేయర్‌గా ఉండడం ఆమెకు అడ్డంకిగా మారింది. ఆ పార్టీలో మరొకరికి ఇవ్వాలనుకుంటే 22వ వార్డు కార్పొరేటర్ మూర్తియాదవ్, 64వ వార్డు కార్పొరేటర్ దల్లి గోవిందరెడ్డికి అవకాశం ఇవ్వాలి. కానీ మూర్తియాదవ్ తాను ఎలాంటి పదవి తీసుకోనని స్పష్టం చేయగా, దల్లి గోవిందరెడ్డికి సామాజిక వర్గాల సమీకరణలు అడ్డుగా నిలిచాయి. వైసీపీ నుంచి ఆ పార్టీలో చేరిన వారికి ఇవ్వాలనుకున్నా సరే డిప్యూటీ మేయర్‌గా పోటీ చేసినపుడు బీ-ఫారం జారీలో సాంకేతిక ఇబ్బందులు వస్తాయి కాబట్టి ఇతరులకు అవకాశం లేదని కూటమి ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. ఏదిఏమైనా కొత్త డిప్యూటీ మేయర్ ఎవరనేది అమరావతిలో బుధవారం సీఎం చంద్రబాబు సమక్షంలో మేయర్‌తోపాటు ఎమ్మెల్యేలతో జరిగే సమావేశంలో తేలుతుంది.

క్రైం... crime news

హత్యాయత్నం కేసులో నిందితుడి అరెస్టు

రోలుగుంట, మే 13(ఆంధ్రజ్యోతి): భార్యపై హత్యాయత్నం చేసి ఐదేళ్లుగా తప్పించుకు తిరుగుతున్న నిందితుడిని మంగళవారం అరెస్టు చేసినట్టు ఎస్ఐ రామకృష్ణారావు తెలిపారు. కోర్టు వాయిదాలకు హాజరు కాకుండా తప్పించుకు తిరుగుతున్న రోలుగుంట మండలం బీబీపట్నానికి చెందిన బాకూరి రామరాజును మంగళవారం అదుపులోకి తీసుకుని అరెస్టు చేశామన్నారు. 2019లో భార్యపై హత్యాయత్నం చేయడంతో అతనిపై కేసు నమోదైందన్నారు. ఎట్టకేలకు అరెస్టు చేసి కోర్టులో హాజరు పరిచి రిమాండ్‌కు తరలించామని ఎస్ఐ తెలిపారు.

10 కిలోల గంజాయి స్వాధీనం

» ఇద్దరి అరెస్టు



గంజాయి కేసులో నిందితులు, సీజ్ చేసిన కారుతో డీఎస్పీ శ్రీనివాసరావు, సిబ్బంది

నర్సీపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల సమీపంలో పోలీసులు తనిఖీలు నిర్వహించి 10 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ఇద్దరిని అరెస్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను డీఎస్పీ శ్రీనివాసరావు మంగళవారం విలేకరులకు వెల్లడించారు. ముందస్తు సమాచారం మేరకు ఎస్ఐ ఉమామహేశ్వరరావు, సిబ్బంది స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. చింతపల్లి వైపు నుంచి వస్తున్న కారు లోంచి ఓ వ్యక్తి పారిపోవడానికి ప్రయత్నించగా పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. అనుమానం వచ్చి కారుని క్షుణ్ణంగా తనిఖీ చేయగా వెనుక సీటు కింద ఇనుప చానల్స్‌లో తయారు చేసిన అల్మారాలో ఐదు ప్యాకెట్లతో 10 కిలోల గంజాయి లభ్యమైంది. తమిళనాడు రాష్ట్రం తిరుపూర్‌కి చెందిన కార్తీక్ అండవర్, కారు డ్రైవర్ దీపన్‌లను పోలీసులు అరెస్టు చేశారు. గంజాయితో పాటు దాని రవాణాకు వినియోగించిన కారు, నిందితుల నుంచి మూడు సెల్ ఫోన్లు, రూ.8 వేల నగదు స్వాధీనం చేసుకున్నారు. 2023లో కోయంబత్తూరులో కార్తీక్‌పై గంజాయి కేసు ఉందని డీఎస్పీ శ్రీనివాసరావు తెలిపారు.

బావమరుదులను హత్య చేసిన వ్యక్తి అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న సీఐ వర ప్రసాద్ (కుడివైపు). చిత్రంలో నిందితుడు గెన్ను(ముసుగులో ఉన్న వ్యక్తి)

సీలేరు, మే 13 (ఆంధ్రజ్యోతి): సీలేరు పంచాయతీ చింతపల్లి క్యాంప్ వద్ద బావమరుదులను హత్యచేసి, మరో వ్యక్తిని గాయపరిచిన నిందితుడు వంతల గెన్నుని అరెస్టు చేసినట్టు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వరప్రసాద్ తెలిపారు. ఆదివారం రాత్రి అక్కను ఎందుకు కొడుతున్నావని ప్రశ్నించిన బావమరుదులు కిముడు కృష్ణ, కిముడు రాజులను గెన్ను మద్యం మత్తులో ఈటెతో పొడిచి చంపిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై సీలేరు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ బావమరుదులను హత్యచేసిన వంతల గెన్నును గ్రామ శివారులో పట్టుకున్నట్టు చెప్పారు. నిందితుడి నుంచి ఈటెను స్వాధీనం చేసుకుని అరెస్టు చేశామన్నారు. నిందితుడిపై 2013లో హత్యాయత్నం కేసు ఉన్నదన్నారు. నిందితుడికి కోర్టు రిమాండ్ విధించిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రవీంద్ర పాల్గొన్నారు.

విశాఖకు సెమీ రింగ్ రోడ్డు

... 5వ పేజీ తరువాయి

వస్తుంది. అనకాపల్లి, విశాఖపట్నాలను తాకకుండా వాటి పైనుంచి విజయనగరం మీదుగా భోగాపురం వరకు తీసుకువెళ్లాలని ఆలోచన. దీనికి అవసరమైన అలైన్‌మెంట్, రింగ్ రోడ్డు పొడవు, వెడల్పు, అవసరమైన భూములు, వంతెనల నిర్మాణం వంటి అంశాలపై అధ్యయనం చేసి ఒక నివేదిక తయారుచేయడానికి వీఎంఆర్‌డీఏ కన్సల్టెంట్లను ఆహ్వానిస్తూ ప్రకటన చేసింది. మూడు నెలల సమయం ఇచ్చి నివేదిక కోరతామని, ఆపై దానిని ప్రభుత్వానికి సమర్పించి ఆ తదుపరి చర్యలు చేపడతామని వీఎంఆర్‌డీఏ వర్గాలు తెలిపాయి.

85 కి.మీ., ఆరు వరుసలు

వీఎంఆర్‌డీఏ ప్రతిపాదించిన సెమీ రింగ్ రోడ్డు (ఎస్ఆర్ఆర్) అనకాపల్లి-పెందుర్తి-ఆనందపురం మీదుగా భోగాపురం విమానాశ్రయం వరకు వస్తుందని, ఆరు వరుసల్లో ఉంటుందని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్ గోపాల్, కమిషనర్ విశ్వనాథన్‌లు తెలిపారు.

పాఠశాలల పునర్వ్యవస్థీకరణ షురూ

... 5వ పేజీ తరువాయి

పోస్టులు ఉంటే కొన్నింటిని అక్కడే కొనసాగించి మిగిలిన పోస్టులను అవసరం ఉన్న పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్నారు.

అప్‌గ్రేడ్ కానున్న యూపీ పాఠశాలలు..

ఉమ్మడి జిల్లాలో 33 యూపీ పాఠశాలలను ఉన్నత పాఠశాలలుగా అప్‌గ్రేడ్ చేశారు. బక్కన్నపాలెం (చినగదిలి మండలం), బంగారమ్మపాలెం, గోకులపాడు, గుర్రాజుపేట (ఎస్.రాయవరం), బవులువాడ, కుంచంగి, రామాపురం, సిరసపల్లి (అనకాపల్లి మండలం), చినఉప్పాడ (భీమిలి), చౌడపల్లి, కొత్తపాలెం, కృష్ణాపురం, తాజంగి (చింతపల్లి), దండి సురవరం, దిబ్బపాలెం (చీడికాడ), దిబ్బపాలెం (అచ్యుతాపురం), దురువీధి (హుకుంపేట), జి.వెంకటాపురం, జంగాలపల్లి (మాకవరపాలెం), కరికంపుట్టు (ముంచంగిపుట్టు), ఖండేపల్లి (చోడవరం), కొడవటిపూడి (కోటవురట్ల), మల్లాం (బుచ్చెయ్యపేట), పాల్మన్‌పేట (పాయకరావుపేట), పెదపల్లి (ఎలమంచిలి), పొట్నూరు (పద్మనాభం), రమణయ్యపేట (నక్కపల్లి), రింతాడ (జీకే వీధి), నందివలస (అరకులోయ), కృష్ణాపురం (జి.మాడుగుల), ఆర్‌బీఎం యూపీ పాఠశాల (మహారాణిపేట), ముస్లింతాటిచెట్లపాలెం ఉర్దూ యూపీ పాఠశాల (సీతమ్మధార) ఉన్నాయి.



ఉన్నత పాఠశాలగా అప్‌గ్రేడ్ కానున్న అచ్యుతాపురం మండలం దిబ్బపాలెం యూపీ స్కూల్

ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడి అరెస్టు

విశాఖపట్నం, మే 13 (ఆంధ్రజ్యోతి): ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ కేసులో ప్రధాన నిందితుడిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తూ మోసాలకు పాల్పడుతూ తప్పించుకు తిరుగుతున్న కాకినాడకు చెందిన చీకట్ల వెంకటమణి చందు అలియాస్ చందూని కాకినాడలో అరెస్టు చేశారు. చందు దగ్గర నుంచి నాలుగు స్మార్ట్ ఫోన్లు, ఒక కీప్యాడ్ ఫోన్‌ను సైబర్ క్రైం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	105.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	220.00
స్కిన్ లెస్	230.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	505
విజయనగరం	509
శ్రీకాకుళం	509